

స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో

కూటమికి 9, వైసీపీకి 1

- ఓటింగ్‌కు ఐదుగురు కార్పొరేటర్లు గైర్హాజరు

విశాఖపట్నం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): **జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో కూటమి తొమ్మిది స్థానాలు గెలుచుకోగా, వైసీపీ ఒక స్థానం దక్కించుకుంది. స్టాండింగ్ కమిటీలో పది స్థానాలకు టీడీపీ నుంచి తొమ్మిది మంది, బీజేపీ నుంచి ఒకరు, వైసీపీ నుంచి పది మంది నామినేషన్ దాఖలు చేశారు.**

జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని పాత కౌన్సిల్ హాల్‌లో బుధవారం ఉదయం పది గంటలకు పోలింగ్ మొదలైంది. మధ్యాహ్నం రెండు గంటలకు ముగిసింది. జీవీఎంసీలో మొత్తం 97 మంది కార్పొరేటర్లు ఓటు హక్కు కలిగివుండగా, వారిలో ... మిగతా 6వ పేజీలో

ఎవరికెన్ని ఓట్లు వచ్చాయంటే...

వ.నెం పేరు	పార్టీ	వచ్చిన ఓట్లు
1. కొణతాల నీలిమ	టీడీపీ	58
2. గంకల కవిత	బీజేపీ	57
3. దాడి వెంకటరామేశ్వరరావు	టీడీపీ	57
4. మొల్లి హేమలత	టీడీపీ	57
5. సేనాపతి వసంత	టీడీపీ	54
6. గేదెల లావణ్య	టీడీపీ	53
7. మాదంశెట్టి చినతల్లి	టీడీపీ	52
8. రాపర్తి త్రివేణివరప్రసాదరావు	టీడీపీ	52
9. మొల్లి ముత్యాలు	టీడీపీ	51
10. సాడి పద్మారెడ్డి	వైసీపీ	50
11. రౌతు శ్రీనివాసరావుటీడీపీ	49	
12. నక్కెళ్ల లక్ష్మీ	వైసీపీ	39
13. పల్లా అప్పలకొండ	వైసీపీ	38
14. మహ్మద్ ఇమ్రాన్	వైసీపీ	38
15. కోడిగుడ్ల పూర్ణిమ	వైసీపీ	38
16. రెయ్యి వెంకటరమణ	వైసీపీ	37
17. గుండపు నాగేశ్వరరావు	వైసీపీ	35
18. ఉరుకూటి రామచంద్రరావు	వైసీపీ	35
19. కేవీఎస్ శశికళ	వైసీపీ	34
20. బిపిన్‌కుమార్‌జైన్	వైసీపీ	33



మేయర్ పీలా శ్రీనివాసరావు, డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరాజులతో స్టాండింగ్ కమిటీ సభ్యులుగా ఎన్నికైన దాడి వెంకటరామేశ్వరరావు, మొల్లి హేమలత, కొణతాల నీలిమ, గంకల కవిత, సేనాపతి వసంత, గేదెల లావణ్య, మాదంశెట్టి చినతల్లి, రాపర్తి త్రివేణివరప్రసాదరావు, మొల్లి ముత్యాలు, ఇతర నాయకులు

స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో

క్రాస్ ఓటింగ్

పూర్తి మెజారిటీ ఉన్నా కూటమి చేజారిన ఒక స్థానం

- 32 మంది సభ్యులే ఉన్నా 50 ఓట్లతో ఆ స్థానాన్ని దక్కించుకున్న వైసీపీ
- పార్టీ నేతలపై కూటమి కార్పొరేటర్లలో అసంతృప్తే కారణం
- ఎమ్మెల్యేలు పట్టించుకోకపోవడం మరో కారణం

విశాఖపట్నం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): **జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో కూటమికి గట్టి షాక్ తగిలింది. కౌన్సిల్‌లో పూర్తి మెజారిటీ ఉన్నప్పటికీ ఒక స్థానం కోల్పోవడం నేతలను అవాక్కయ్యేలా చేసింది. కౌన్సిల్‌లో ప్రస్తుతం 97 మంది కార్పొరేటర్లు ఉండగా, వారిలో కూటమి మద్దతుదారులు 63 మంది ఉన్నారు. వైసీపీకి 32 మంది, సీపీఐ, సీపీఎంలకు ఒక్కొక్క కార్పొరేటర్ ఉన్నారు.**



స్టాండింగ్ కమిటీ సభ్యురాలిగా ఎన్నికైన వైసీపీ కార్పొరేటర్ సాడి పద్మారెడ్డితో పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, ఇతర కార్పొరేటర్లు, నాయకులు

స్టాండింగ్ కమిటీలో పది మంది సభ్యులను ఎన్నుకునేందుకు బుధవారం పోలింగ్ జరిగింది. వీరిలో ఐదుగురు (కూటమికి చెందినవారు) గైర్హాజరు కాగా, 92 మంది మాత్రమే ఓటు హక్కు వినియోగించుకున్నారు. స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా ఎన్నికవ్వాలంటే కనీసం 46 ఓట్లు దక్కించుకోవాల్సి ఉండడంతో కూటమి అభ్యర్థుల గెలుపు లాంఛనమేనని అంతా భావించారు. వైసీపీ సభ్యులు కూడా మొక్కుబడిగా పోటీకి దిగారు. కానీ అనూహ్యంగా వైసీపీ తరఫున పోటీకి దిగిన పది మందిలో ఒకరైన సాడి పద్మారెడ్డి గెలుపొందడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. అత్యధిక ఓట్లు సాధించిన మొదటి పది మందిని విజేతలుగా అధికారులు ప్రకటిస్తారు. కూటమి తరఫున పోటీ చేసిన తొమ్మిది మందికి 51 కంటే ఎక్కువ ఓట్లు దక్కగా, వారి తర్వాత వైసీపీకి చెందిన సాడి పద్మారెడ్డి 50 ఓట్లు దక్కించుకుని పదో స్థానంలో నిలవడంతో ఆమె ఎన్నికైనట్టు అధికారులు ప్రకటించారు. కౌన్సిల్‌లో వైసీపీకి 32 మంది సభ్యుల బలం ఉంది. అయితే కూటమి కార్పొరేటర్లు క్రాస్‌ఓటింగ్‌కు పాల్పడడంతో పద్మారెడ్డికి అదనంగా 18 ఓట్లు పడ్డాయి. కూటమిలో అనైక్యత, అసమ్మతి ఇందుకు కారణమని అంటున్నారు.

కూటమి కార్పొరేటర్లలో తీవ్ర అసంతృప్తి

అధికారపక్షంలోకి మారిన తర్వాత కూటమి కార్పొరేటర్లలో అసంతృప్తి ... మిగతా 6వ పేజీలో

రైల్వే జోన్‌కు అధికారులు

త్వరలోనే నియామకం

- తదనంతరం ఆస్తుల పంపకం, సిబ్బంది బదిలీలు
- ఢిల్లీ వెళ్లి వచ్చిన జీఎం సందీప్ మాథుర్
- హెచ్ఓడీల కేటాయింపుపై చర్చలు
- ప్రిన్సిపల్ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ నియామకానికి గ్రీన్‌సిగ్నల్



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి) **విశాఖ కేంద్రంగా ప్రకటించిన దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు త్వరలో అధికారులు నియామకం కానున్నారు. ఇప్పటికే జనరల్ మేనేజర్‌గా సందీప్ మాథుర్‌ను నియమించిన కేంద్రం...ఆయనతో కలిసి పనిచేసేందుకు వివిధ విభాగాల అధిపతులను పంపడానికి చర్యలు చేపడుతోంది. ఇదే పనిపై ఢిల్లీ వెళ్లిన జీఎం సందీప్ మాథుర్ జోన్ కార్యాలయం ఏర్పాటుచేసుకుంటే ఏయే విభాగాల అధికారులు కావాలో స్పష్టంగా అక్కడి పెద్దలకు వివరించి వచ్చారు.**

జోన్ కార్యాలయానికి అవసరమైన స్థలాన్ని ఎంపీ శ్రీభరత్ చొరవతో వీఎంఆర్‌డీఏకు చెందిన 'ది డెక్'లో కేటాయించిన సంగతి తెలిసిందే. దీనిపై ఎంవోయూ జరిగిన వెంటనే ఇంటీరియర్ పనులు ప్రారంభించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈలోగా జోన్‌కు సంబంధించిన గెజిట్, ఆపరేషన్ తేదీని ప్రకటింపజేసేందుకు కూటమి నాయకులు ఢిల్లీలో ప్రయత్నిస్తున్నారు.

ఐదేళ్లు ఆగిన జోన్ పనులు

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రైల్వే జోన్ పనులు ఎక్కడివక్కడే ఆగిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఒక్కొక్క సమస్యను పరిష్కరించుకుంటూ వస్తున్నారు. రైల్వే జోన్‌కు అవసరమైన భూమిని కేటాయించడానికి వైసీపీ పెద్దలు ఐదేళ్లు తాత్సారం చేశారు. అదిగో..ఇదిగో అంటూ కాలయాపన చేశారు. కూటమి ప్రభుత్వం రాగానే ముడసర్లోవ భూములు రైల్వే శాఖ పేరిట రెవెన్యూ రికార్డుల్లో మ్యుటేషన్ చేసి అప్పగించింది. ఆ భూముల్లో ఆక్రమణదారులు అడ్డం పడితే వారిని కూడా తప్పించి, అక్కడ జోన్ కార్యాలయం పనులు ప్రారంభింపజేసింది. వాటికి ప్రధాని మోదీతోనే శంకుస్థాపన చేయించారు. అన్నీ ఉన్నా అధికారులను ఇవ్వడం లేదని గుర్తించి జోన్‌కు జనరల్ మేనేజర్‌ను నియమింపజేశారు. ఇప్పుడు ఆయనకు అవసరమైన టీమ్‌ను సమకూర్చే ప్రయత్నంలో ఉన్నారు. జోన్ నిర్వహణకు 12 విభాగాలు కీలకం. జనరల్ అడ్మినిస్ట్రేషన్, ఆపరేషన్లు, కమర్షియల్, సిగ్నల్ అండ్ టెలికం, స్టోర్స్, పర్సనల్, ఫైనాన్స్, మెకానికల్, ఎలక్ట్రికల్, సివిల్ ఇంజనీరింగ్, పబ్లిక్ రిలేషన్స్, సెక్యూరిటీ, ఎలక్ట్రికల్ జనరల్ విభాగాలు ఉంటాయి. వీటికి విభాగాధిపతులను నియమిస్తే వారి కింద పనిచేయడానికి వివిధ డివిజన్లలో పనిచేస్తున్న వారిని కేటాయిస్తారు. వీటిలో మళ్లీ తక్షణ అవసరంగా జనరల్ అడ్మిన్, మెకానికల్, ఎలక్ట్రికల్, సివిల్ ఇంజనీరింగ్, పబ్లిక్ రిలేషన్స్ అధికారులు కావాలని జీఎం ఢిల్లీ పెద్దలను కోరారు. వారిని కేటాయిస్తే లోకో షెడ్లు, కోచ్ కేర్ సెంటర్లు, వ్యాగన్ వర్క్‌షాపుల పనులు ప్రారంభమవుతాయి. ప్రధానంగా ప్రిన్సిపల్ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ నియామకానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. విభాగాధిపతులు వస్తే ఆస్తుల పంపకం, సిబ్బంది బదిలీలు వంటివి ప్రారంభమవుతాయని రైల్వే వర్గాలు చెబుతున్నాయి.

ప్రైవేటు హాస్టళ్లలో భద్రత ప్రశ్నార్థకం

అనుమతులు లేకుండానే నిర్వహిస్తున్న కళాశాలల యాజమాన్యాలు

- ఈ ఏడాది కొత్తగా మరిన్ని ఏర్పాటు
- దృష్టి సారించని ఉన్నత విద్యా శాఖ అధికారులు
- తూతూమంత్రంగా తనిఖీలు

విశాఖపట్నం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): **నగరంలో ఇష్టానుసారంగా హాస్టళ్లు ఏర్పాటుచేస్తున్న ప్రైవేటు/కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాలు వాటి నిర్వహణను సరిగా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల నగర శివారునున్న ఒక ప్రైవేటు జూనియర్ కళాశాల హాస్టల్ నాలుగో అంతస్థులో అగ్ని ప్రమాదం సంభవించింది. ఆ సంస్థకు రెండుచోట్ల జూనియర్ కళాశాలలు ఉండగా, వాటిలో చదువుకుంటున్న సుమారు 60 మంది హాస్టల్‌లో ఉంటున్నారు. సాయంత్రం స్నాక్స్ కోసం వారంతా కిందకు దిగిన సమయంలో ప్రమాదం జరిగింది. ఈ ఘటన నగరంలోని ప్రైవేటు కళాశాలలు, హాస్టళ్ల నిర్వహణపై సందేహాలు రేకెత్తిస్తోంది.**




మధురవాడలోని ఓ ప్రైవేటు కళాశాల హాస్టల్ నుంచి వస్తున్న పొగ (ఫైల్ ఫొటో)

ఇంటర్ బోర్డు సమాచారం మేరకు నగరంలో సుమారు 40 జూనియర్ కళాశాలలకు అనుబంధంగా హాస్టళ్లు నడుస్తున్నాయి. ఈ ఏడాది కొత్తగా మరో పది ఏర్పాటయ్యాయి. ఉత్తరాది, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు చెందిన సంస్థలు నగరంలో జూనియర్ కళాశాలలు నెలకొల్పాయి. దీంతో వాటికి ... మిగతా 6వ పేజీలో

9న సీఎం పాడేరు పర్యటన ఖరారు

వంజంగి గ్రామ సమీపంలో కాఫీ రైతులతో ముఖాముఖి

- అక్కడికి సమీపంలో బహిరంగ సభ



పాడేరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పాడేరు మండల పర్యటన దాదాపుగా ఖరారైంది. అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆయన గిరిజన ప్రాంతంలో పర్యటించాలని నిర్ణయించారు. సీఎం ఈ నెల 9న పాడేరు మండలం వంజంగి గ్రామానికి ఆనుకుని ఉన్న కాఫీ తోటల్లో గిరిజన రైతులతో ముచ్చటిస్తారు. అనంతరం లగిశపల్లి, ఉగ్గంగొయ్యి గ్రామాలకు సమీపంలో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో గిరిజనులను ఉద్దేశించి మాట్లాడతారు. సీఎం పాడేరు పర్యటన నేపథ్యంలో అధికారులు చేపడుతున్న ఏర్పాట్లను పరిశీలించేందుకు సీఎం పర్యటన సమన్వయ కర్త పెందుర్తి వెంకటేశ్ బుధవారం ఇక్కడికి వచ్చారు. అధికారులకు పలు సూచనలు చేశారు.

పరీక్షల నిర్వహణలో వినూత్న ప్రయోగం

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందుబాటులోకి అసెస్‌మెంట్ పుస్తకాలు

- వాటిలోనే జవాబులు రాసేందుకు వీలు
- జిల్లాకు చేరిన 60 శాతం పుస్తకాలు
- విద్యార్థి ప్రతిభ, సామర్థ్యం తెలుసుకునే అవకాశం
- ఈనెల 11 నుంచి ప్రారంభం కానున్న పరీక్షలు



విద్యాశాఖ సరఫరా చేసిన అసెస్‌మెంట్ బుక్‌లెట్

విశాఖపట్నం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): **ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నిర్వహించే పరీక్షల్లో కొత్త విధానానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం జవాబు పత్రాలను విడిగా రాసి అందిస్తుండడంతో మూల్యాంకనం అనంతరం వాటిని పక్కన పడేస్తున్నారు. ఈ నేపథ్యంలో బుక్‌లెట్ అందించి, అందులోనే సమాధానాలు రాసేవిధంగా మార్పుచేశారు. దీంతో విద్యార్థి ప్రతిభ, సామర్థ్యం అంచనా వేసేందుకు అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.**

పాఠశాల విద్యార్థులకు నిర్వహించే ఫార్మేటివ్ నుంచి సమ్మేటివ్ పరీక్షల వరకు తెల్లకాగితాలపై జవాబులు రాసే విధానానికి విద్యా శాఖ స్వస్తి పలికింది. ఏడాది పొడవునా పరీక్షలు రాసేందుకు వీలుగా అసెస్‌మెంట్ బుక్‌లెట్ రూపొందించింది. ఈనెల 11వ తేదీ నుంచి ఫార్మేటివ్-1 పరీక్షలు జరగనున్న నేపథ్యంలో అసెస్‌మెంట్ బుక్‌లెట్‌ను అందుబాటులోకి తెచ్చింది. ప్రతి విద్యాసంవత్సరంలో విద్యార్థులకు నాలుగు ఫార్మేటివ్, రెండు సమ్మేటివ్ పరీక్షలు నిర్వహిస్తుంటారు. ప్రతి పరీక్షకు సంబంధించి విద్యార్థులు రాసే జవాబుపత్రాలను ఉపాధ్యాయులు మూల్యాంకనం చేసి ... మిగతా 6వ పేజీలో

కోటనరవ పార్కు స్థలంపై యథాతథ స్థితి

- భూ మార్పిడి వ్యవహారాన్ని జీవీఎంసీ కౌన్సిల్‌లో పెట్టండి
- హైకోర్టు స్పష్టీకరణ

ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం



అమరావతి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) పరిధి కోటనరవ గ్రామంలోని ఈడబ్ల్యూఎస్ కాలనీలో 180 గజాల పార్కు స్థలం విషయంలో యథాతథ స్థితి పాటించాలని పురపాలక శాఖ అధికారులను హైకోర్టు ఆదేశించింది. అయితే పార్కు స్థలాన్ని ప్రైవేటు వ్యక్తికి ఇచ్చి, వారి స్థలాన్ని జీవీఎంసీ తీసుకొనే వ్యవహారాన్ని కౌన్సిల్ సమావేశంలో ఉంచి నిర్ణయం తీసుకొనేందుకు జీవీఎంసీకి వెసులుబాటు ఇచ్చింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. విచారణను వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ... మిగతా 6వ పేజీలో

ఏయూ శతాబ్ది ఉత్సవాలకు షెడ్యూల్

రానున్న మూడు నెలల్లో సెమినార్లు, వర్క్‌షాప్‌లు నిర్వహణ

- వివరాలు విడుదల చేసిన వైస్ చాన్సలర్ జీపీ రాజశేఖర్



విశాఖపట్నం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయంలో శతాబ్ది ఉత్సవాల నిర్వహణకు సంబంధించి అధికారులు షెడ్యూల్ విడుదల చేశారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఉత్సవాలను ప్రారంభించిన విషయం తెలిసిందే. ఏడాదిపాటు ఉత్సవాలను నిర్వహించాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో రానున్న మూడు నెలల వేడుకలకు సంబంధించిన షెడ్యూల్‌ను బుధవారం వైస్ చాన్సలర్ జీపీ రాజశేఖర్ విడుదల చేశారు. ఆ వివరాలను ఏయూ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. ఆగస్టు ఏడో తేదీన న్యాయ కళాశాలలో జస్టిస్ జాస్తి చలమేశ్వర్ ధర్మనిధి ప్రసంగం, ఫార్మసీ కళాశాలలో ప్రొఫెసర్ ఇ.వెంకటరావు ఎండోమెంట్ లెక్చర్ ఉంటాయి. 12న ఎకనామిక్స్ విభాగంలో జాతీయ వర్క్‌షాప్, 12, 13 తేదీల్లో ఏయూ మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో సైబర్ నేరాల నియంత్రణపై వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. 19 నుంచి 21 వరకు ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో ఎఫ్‌డీపీ కార్యక్రమాన్ని, 28 నుంచి సెప్టెంబర్ ఒకటో తేదీ వరకు క్వాంటం కంప్యూటింగ్‌పై ఎఫ్‌డీపీ కార్యక్రమాన్ని కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగంలో నిర్వహించనున్నారు. అదేవిధంగా సెప్టెంబరు నాలుగు, 15 తేదీల్లో రసాయన శాస్త్రం, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగాల్లో ఎండోమెంట్ లెక్చర్లు ఏర్పాటుచేశారు. ఏడో తేదీన సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో స్పెషల్ కాంక్రీట్ ఫర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నీడ్స్ అనే అంశంపై జాతీయ సదస్సు. 8 నుంచి 12 వరకు పర్యావరణ శాస్త్ర విభాగంలో సస్టైనబులిటీ యాజ్ ఏ టూల్ ఫర్ రిస్క్ రిడక్షన్ అంశంపై ఎఫ్‌డీపీ కార్యక్రమం. 15, 16 తేదీల్లో సివిల్ ఇంజనీరింగ్ విభాగం విద్యార్థుల ఆధ్వర్యంలో సింపోజియం. 16, 17 తేదీల్లో ఏయూ మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో హై పెర్‌ఫార్మెన్స్ కంప్యూటింగ్‌పై ... మిగతా 6వ పేజీలో

హోటళ్లు, బేకరీలపై కేసులు

నిల్వ ఆహారం శాంపిల్స్ పరీక్ష నిమిత్తం ల్యాబ్‌కు...

- కలర్స్ వినియోగించిన ఆహార పదార్థాల వినియోగానికి ప్రజలు దూరంగా ఉండాలి
- ఆహార భద్రత, ప్రమాణాల శాఖ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ ఎస్.కల్యాణ చక్రవర్తి



మాట్లాడుతున్న అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ ఎస్.కల్యాణ చక్రవర్తి

విశాఖపట్నం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని హోటళ్లు, రెస్టారెంట్లు, స్వీట్స్ దుకాణాలు, బేకరీల్లో ఈ నెల ఒకటి, రెండు తేదీల్లో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జాయింట్ కంట్రోలర్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించి పలు కేసులు నమోదు చేశామని ఆహార భద్రత, ప్రమాణాల శాఖ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ ఎస్.కల్యాణ చక్రవర్తి తెలిపారు. బుధవారం ఉదయం పెదవాల్తేరులోని కార్యాలయ ఆవరణలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. 40 మంది అధికారులతో కూడిన 20 బృందాలు ఈ తనిఖీలు ... మిగతా 6వ పేజీలో



రేషన్ డిపో వద్ద వేచి వున్న లబ్ధిదారులు

మజ్జివలసలో రేషన్ డిపో మూసివేత

భీమునిపట్నం (రూరల్), ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మజ్జివలస గ్రామంలో కొద్ది రోజులుగా రేషన్ డిపోను సక్రమంగా తెరవడం లేదు. ప్రతిరోజూ డిపో వద్ద సరకుల కోసం లబ్ధిదారులు వేచి చూడాల్సి వస్తోంది. మంగళవారం 2 గంటల పాటు వేచి ఉన్నారు. బుధవారం డిపోను పూర్తిగా తెరవలేదు.ప్రతిరోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రేషన్ డిపోలను కచ్చితంగా తెరిచి ఉంచాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కానీ మజ్జివలస డీలరు సక్రమంగా తెరవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ దుకాణంలో సరకులు తీసుకోవడానికి పంచాయతీ శివారు ప్రాంతాల నుంచి కూడా ప్రజలు వస్తుంటారు. డిపో సక్రమంగా తెరకపోవడంతో ప్రతిరోజూ రాలేక ఇబ్బందులు పడుతున్నారు. ఈవిషయమై గ్రామస్థులు అధికారులకు ఫిర్యాదు చేశారు. కాగా తహసీల్దార్ రామారావు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ విషయాన్ని సంబంధిత అధికారికి తెలియజేశామని, అలక్ష్యం వహించే డీలర్లపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

తీర ప్రాంత భద్రతపై 'గీతం'లో మాక్ డ్రిల్



మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న ఆక్టోపస్ కమాండోలు

సాగర్‌నగర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) :తీర ప్రాంత భద్రతతో పాటు తీవ్రవాదులు చొరబడినప్పుడు ఎలా స్పందించాలి, రక్షణ చర్యలు ఎలా చేపట్టాలన్న విషయాలపై ఆక్టోపస్ చార్లీ టీమ్ ఆధ్వర్యంలో గీతం వర్సిటీలో బుధవారం మాక్ డ్రిల్ నిర్వహించారు.ఆక్టోపస్ కమాండోలు అత్యాధునిక ఆయుధాలతో వర్సిటీలోని పలు భవంతుల్లో తీవ్రవాదులను గుర్తించి, సిబ్బందిని రక్షించే విధంగా ఆపరేషన్ జరిపారు. అనంతరం చార్లీ టీమ్ డీఎస్పీలు తిరుపతయ్య, డి. రాంబాబు నేతృత్వంలో ఎస్ఐలు శివాజీ, పీఎస్ఎం రెడ్డి, శ్రీనివాసరావు అత్యవసర పరిస్థితుల్లో ఎలా స్పందించాలో విద్యార్థులకు, సిబ్బందికి, గీతం భద్రతా విభాగానికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గీతం వర్సిటీ సేఫ్టీ విభాగం అధికారి చక్రధర్, విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ అధికారి గోపీ కుమార్, పలు విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

పరీక్షల నిర్వహణలో వినూత్న ప్రయోగం

... 5వ పేజీ తరువాయి

మూలనపడేస్తుంటారు. దీంతో అవసరమైన సందర్భంలో విద్యార్థి ప్రతిభ, సామర్థ్యం తెలుసుకునే వీలుండడం లేదు. ఈ నేపథ్యంలో ఉచితంగా అందజేసే అసెస్‌మెంట్ బుక్‌లెట్ విద్యార్థి ప్రతిభకు ప్రామాణికంగా నిలుస్తుందని ప్రభుత్వం భావించింది. ప్రతి సబ్జెక్టుకు ఒక అసెస్‌మెంట్ బుక్‌లెట్‌ను సరఫరా చేస్తోంది. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు సుమారు 75 వేల మంది చదువుతున్నారు. ఒకటి, రెండు తరగతులకు మూడు సబ్జెక్టులు, 3,4,5 తరగతులకు నాలుగు, ఆరు, ఏడు తరగతులకు ఆరు, ఎనిమిది నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు ఏడు సబ్జెక్టులు బోధిస్తున్నారు. ఈ మేరకు ఉచితంగా అసెస్‌మెంట్ పుస్తకాలు అందజేస్తారు. పరీక్ష ముగిసిన తరువాత సబ్జెక్టు టీచరు దానిని మూల్యాంకనం చేస్తారు. అసెస్‌మెంట్ పుస్తకాలు సబ్జెక్టు టీచర్ల వద్దనే ఉంటాయి. పరీక్షల ఆధారంగా విద్యార్థుల సామర్థ్యం అంచనా వేసేందుకు ఇవి దోహదపడతాయని జిల్లా పరీక్షల బోర్డు కార్యదర్శి ఎంవీ కృష్ణకుమార్ అభిప్రాయపడ్డారు. ఇప్పటివరకు ఇండెంట్‌లో 60 శాతం సరఫరా చేశారని, మిగిలినవి ఒకటి, రెండు రోజుల్లో వస్తాయన్నారు.

పార్కు స్థలంపై యథాతథ స్థితి

... 5వ పేజీ తరువాయి

చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. విశాఖపట్నం జిల్లా, కోటనరవ గ్రామం పరిధిలో సర్వే నంబర్ 10/9బీ ఈడబ్ల్యూఎస్ కాలనీలో 180 గజాల పార్కు స్థలాన్ని ప్రైవేటు వ్యక్తి మల్ల రమణకు ఇచ్చి, వారి స్థలాన్ని జీవీఎంసీ తీసుకొనేందుకు అనుమతిస్తూ ఈ ఏడాది మార్చి 5న పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ను సవాల్ చేస్తూ జనసేన కార్పొరేటర్ పీవీఎల్ఎన్ మూర్తి యాదవ్ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు రాగా...పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది కేఎస్ మూర్తి యాదవ్ వాదనలు వినిపించారు. పార్కు స్థలాన్ని ఇతర అవసరాల కోసం వినియోగించడానికి వీల్లేదన్నారు. పార్కు స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులతో పరస్పర మార్పిడి చేసుకొనేందుకు...కౌన్సిల్ సమావేశంలో ఉంచి ఆమోదం పొందాల్సి ఉంటుందన్నారు. కౌన్సిల్ ఆమోదం లేకుండానే పురపాలకశాఖ ఏకపక్షంగా ప్రొసీడింగ్స్ ఇచ్చిందన్నారు. అనధికార ప్రతివాది తరఫున న్యాయవాది పదిరి రవితేజ వాదనలు వినిపించారు.ఇప్పటికే ఉన్న రోడ్డును వెడల్పు చేసేందుకు వీలుగా పరస్పర స్థల మార్పిడి నిమిత్తం జీవీఎంసీకి దరఖాస్తు చేశామన్నారు. ఈ వ్యవహారంపై కౌన్సిల్ నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు.

ప్రైవేటు హాస్టళ్లలో భద్రత ప్రశ్నార్థకం

... 5వ పేజీ తరువాయి

అనుబంధంగా హాస్టళ్లు వెలిశాయి. జూనియర్ కళాశాలల పరిధిలో హాస్టళ్ల నిర్వహణకు ఇంటర్ బోర్డు అనుమతి ఇవ్వడం లేదు.అయినప్పటికీ కొంతమంది స్థానిక సంస్థల నుంచి తూతూమంత్రంగా సర్టిఫికెట్ తెచుకుని హాస్టళ్లు ఏర్పాటు చేస్తున్నారు. మరికొందరు సర్టిఫికెట్లు లేకుండానే హాస్టళ్లు గడుపుతున్నారు. అగ్నిమాపక, విద్యుత్ సంస్థల నుంచి కూడా అనుమతులు పొందడం లేదు.

ఇష్టారాజ్యంగా నిర్వహణ

ఉత్తరాంధ్ర జిల్లాలతోపాటు పొరుగు రాష్ట్రాల విద్యార్థులు వస్తుండడంతో నగరంలో ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలు పెరిగాయి. వాటిలో చాలావరకూ హాస్టళ్లు నడుపుతున్నాయి. కొద్ది సంస్థలు మినహా మిగిలిన యజమాన్యాలు గాలికి వదిలేశాయి. వాటిపై దృష్టి సారించాల్సిన ఇంటర్ బోర్డు అధికారులు తూతూమంత్రంగా తనిఖీలతో సరిపెట్టేస్తున్నారు. ఇంటర్ బోర్డులో ఆర్ఐవో, సూపరింటెండెంట్, ఇద్దరు ముగ్గురు ఉద్యోగులు మాత్రమే ఉన్నారు. వారికి నగరంలోని అన్ని కళాశాలలు,హాస్టళ్లు తనిఖీ చేయడం సాధ్యంకాదు. ఈ నేపథ్యంలో కమిటీలను నియమించి తనిఖీల బాధ్యతను అప్పగిస్తుంటారు. ఈ కమిటీల్లో ఉన్న అధ్యాపకులను ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు ప్రలోభాలకు గురిచేస్తుంటాయి. దీంతో అన్నీ సక్రమంగానే ఉన్నాయని సర్టిఫికెట్ జారీ చేసేస్తున్నారు. గత ఏడాది వాల్తేర్‌లోని ఓ కళాశాల హాస్టల్‌లో ఆహారం కలుషితమై పలువురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. దీంతో నగరంలోని హాస్టళ్ల పనితీరుపై నివేదిక కోరుతూ కలెక్టర్ కమిటీలు వేశారు. అయితే ఆ కమిటీలు ప్రైవేటు జూనియర్ కళాశాలల పరిధిలోని హాస్టళ్ల పనితీరు భేషుగ్గా ఉందని తేల్చాయి. పరిశుభ్రత విషయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని మాత్రమే సూచించాయి. కమిటీలోని అధ్యాపకులకు భారీగా ముడుపులు అందడంతోనే ఇలాంటి నివేదికలు ఇచ్చారనే ఆరోపణలు వినిపించాయి. ఇటీవల ఓ కార్పొరేట్ కళాశాల హాస్టల్‌లో అగ్ని ప్రమాదం సంభవించిన నేపథ్యంలో ఇంటర్ బోర్డు అధికారులు భద్రత, అనుమతులు, నిర్వహణపై తనిఖీలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



తగరపువలసలో రోడ్డు విస్తరణ పనులు జరిగే ప్రాంతంలో అనధికారికంగా బోరు తవ్వకం



స్థానికులు ఎదురు తిరగడంతో పనుల వద్ద నిలిచిపోయిన రెవెన్యూ అధికారులు, సిబ్బంది

ఆక్రమణదారుల బరితెగింపు

- ఎండాడలో రెవెన్యూ సిబ్బందిపై దుర్భాష
- బోరు తవ్వకం పనులను అడ్డుకునేందుకు వెళ్లిన వారిపై దౌర్జన్యం
- ఆర్‌డీఓకి అధికారుల ఫిర్యాదు
- తగరపువలసలో అర్ధరాత్రి వేళ అక్రమంగా బోరు తవ్వకం
- విస్తరణ పనులను అడ్డుకునే యోచన ?

ఎండాడ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 8వ వార్డులో ఆక్రమణదారులు రెచ్చిపోయారు. అడ్డుకోవడానికి వెళ్లిన రెవెన్యూ అధికారులపై తిరగబడ్డారు. ఈ ఘటన బుధవారం ఎండాడ రాజీవ్‌నగర్ కొండ మీద జరిగింది. హయగ్రీవ ప్రాజెక్ట్ కొండ కింద ఉన్న ప్రభుత్వ స్థలంలో బోరు వేస్తున్నట్టు వచ్చిన సమాచారం మేరకు వీఆర్ఓ వెంకటేష్ అక్కడికి వెళ్లి పనులను అడ్డుకున్నారు. పైపులు తొలగించాలని చెప్పారు. స్థానికులు దుర్భాలాడడంతో వీఆర్‌ఓ, ఆర్ఐ హరితేజకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఆయన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆర్ఐపై కూడా అదే రీతిన దుర్భాషలాడుతూ దౌర్జన్యానికి తెగబడ్డారు. గతంలో వీఆర్‌వోగా ఉన్న ఇమ్రాన్‌పైనా ఇలానే తిరగబడ్డారు. దీంతో హయగ్రీవ కొండ మీద ఆక్రమణల తొలగింపునకు వెళ్లడానికి అధికారులు భయపడుతున్నారు. కొద్దిరోజుల క్రితం ఇదే వార్డులో తిమ్మాపురంలో కూడా ఆక్రమణలు తొలగించడానికి వెళితే సిబ్బందిపై తిరగబడ్డారు. తహసీల్దార్, ఆర్డీవోకు ఫిర్యాదు చేయడంతో ఆయన డీసీపీకి లేఖ రాసి పోలీసుల సహాయంతో ఆక్రమణలు తొలగించారు. ఈ సంఘటనపై కూడా ఆర్డీవో చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రోడ్డు విస్తరణ మార్కింగ్ ప్రాంతంలో బోరు తవ్వకం

తగరపువలస : స్థానిక అంబేడ్కర్ కూడలిలో జీవీఎంసీ అధికారులు రహదారి విస్తరణకు మార్కింగ్ చేసిన ప్రాంతంలో అనధికారింగా బోరు తవ్వకం చేపట్టారు. ప్రస్తుతం ఉన్న ప్రధాన రహదారి మధ్యలో అటు ఇటు 40 అడుగుల మేర రహదారి వెడల్పు చేయడానికి జీవీఎంసీ అధికారులు మార్కింగ్ ఇచ్చారు. ఈ మార్కింగ్ లోపల అర్ధరాత్రి బోరు తవ్వకం చేపట్టి, బుధవారం ఉదయానికి పూర్తి చేశారు. వాస్తవానికి గొట్టపు బావి తవ్వకానికి ముందస్తు అనుమతి ఉండాలి.కానీ ఎటువంటి అనుమతి లేకుండా రహదారిని ఆనుకుని బోరు తవ్వకం పట్ల పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. స్థానికంగా బేకరిని ఆనుకుని ఫైనాన్స్ కంపెనీ ఉన్న భవనం యజమాని ఈ నిర్మాణం చేపట్టినట్టు తెలిసింది. రహదారిని ఆనుకుని బోరు తవ్వడం వల్ల విస్తరణ పనులు ఇప్పట్లో జరగవు అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. స్థానిక వ్యాపారులు పైరవీలతో విస్తరణ పనులను అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్న తరుణంలో వారు అధైర్య పడకుండా ఉండేందుకు ఇలా చేశారా అన్న వ్యాఖ్యలు కూడా వినిపిస్తున్నాయి.

కాగా ఈ విషయాన్ని జడ్సీ అయ్యప్పనాయుడు వద్ద ప్రస్తావించగా బోరు వేసుకుంటామని అనుమతి కోసం సోమవారం తన వద్దకు కొంత మంది వచ్చారని, నిబంధనలు మేరకు పనులు చేయాలని చెప్పానన్నారు. కానీ రహదారిని ఆనుకుని విస్తరించే పరిధి లోపల బోరు వేసినట్టు ఫిర్యాదులు అందాయని తెలిపారు. సమస్యను టౌన్ ప్లానింగ్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి చర్యలు తీసుకుంటామన్నారు.

కూటమి కార్పొరేటర్ల రహస్య క్యాంపు

భీమునిపట్నం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నిక నేపథ్యంలో బీచ్ రోడ్‌లోని కాసా రిసార్టులో కూటమి కార్పొరేటర్లు రహస్య శిబిరం నిర్వహించారు. మంగళవారం సాయంత్రం నుంచి రాత్రి 11 వరకూ టీడీపీ కార్పొరేటర్లు ఒక్కొక్కరు రిసార్టుకు చేరుతూనే వున్నారు. టీడీపీ నుంచి 32 మంది, బీజేపీ నుంచి ఇద్దరు కార్పొరేటర్లు వచ్చారు. మేయర్ పీలా శ్రీనివాసరావు అర్ధరాత్రి వరకూ రిసార్టులోనే ఉండి, ఆ తరువాత నగరానికి వెళ్లారు. బుధవారం తెల్లవారుజామున మళ్లీ ఆయన వచ్చారు. ఇక్కడి నుంచి కార్లు, ట్రావెల్ బస్సులో కార్పొరేటర్లను జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి తీసుకువెళ్లారు.



కాసా రిసార్టు వద్ద టీడీపీ కార్పొరేటర్లు



కుక్కను పట్టుకుంటున్న సిబ్బంది

కుక్కల పట్టివేత

సింహాచలం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ పరిధిలోని 98వ వార్డులో జీవీఎంసీ సిబ్బంది వీధి కుక్కలను పట్టుకున్నారు. 'బాబోయ్.. వీధి కుక్కలు' అన్న శీర్షికన సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి వార్డు కార్పొరేటర్ పివి నరసింహం స్పందించారు. ఆయన అధికారులకు ఫిర్యాదు చేయడంతో జీవీఎంసీ ప్రత్యేక సిబ్బంది వచ్చి ప్రియా గార్డెన్స్, సింహగిరిపై, తొలిపావంచా వద్ద వీధి కుక్కలను పట్టుకున్నారు.

గాత్ర కచేరి పోటీలు

ఆనందపురం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంభీరం పంచాయతీ ఐఐఎం రోడ్డులో ఉన్న హరేకృష్ణ మూమెంట్ ఆధ్వర్యంలో రాధామదనమోహన్ మందిరంలో విద్యార్థులకు బుధవారం గాత్ర కచేరి పోటీలు నిర్వహించారు. హెరిటేజ్ ఫెస్ట్ - 2025 కార్యక్రమంలో భాగంగా ఈ పోటీలు జరిపారు. వివిధ పాఠశాలల నుంచి 300 మంది బాలబాలికలు హాజరయ్యారు. ఈ సందర్భంగా హరేకృష్ణ మూమెంట్ అధ్యక్షుడు అంబరీస దాస మాట్లాడుతూ సాంస్కృతిక కార్నివాల్‌కు విశేష స్పందన లభిస్తుందన్నారు.

వైసీపీ బీసీ సెల్ మండల అధ్యక్షుడిగా కోరాడ

ఆనందపురం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ బీసీ సెల్ మండల అధ్యక్షుడిగా తర్లువాడ గ్రామానికి చెందిన కోరాడ ఆదినారాయణ నియమితులయ్యారు. ఈమేరకు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మజ్జి శ్రీనివాసరావు ఆయనకు బుధవారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆదినారాయణ విలేకరులతో మాట్లాడుతూ మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ

భీమునిపట్నం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ కౌన్సిలర్ గొలగాని నరేంద్రకుమార్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. బీచ్ రోడ్‌లో ఉన్న పార్టీ కార్యాలయంలో ఆయన కేక్ కట్ చేసి, కార్యకర్తలకు పంచిపెట్టారు. అనంతరం పారిశుధ్య సిబ్బందికి దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గాడు చిన్నికుమారిలక్ష్మి, గాడు సన్యాసినాయుడు, కనలక అప్పలనాయుడు, కంచర్ల కామేష్, పోలిరాజు పాల్గొన్నారు.



సింహగిరి నుంచి తిరుగు పయనంలో దాసుడు, ఆయన శిష్యులు

ఒడిశాకు తిరుగు పయనమైన దాసుడు

సింహాచలం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : ఒడిశాకు చెందిన ప్రముఖ ఆధ్యాత్మికవేత్త లక్ష్మీకాంత్ నాయక్ దాసుడు ఆ రాష్ట్రానికి తిరుగు పయనమయ్యారు. చందనోత్సవం తరువాత బంధు మిత్రులు, శిష్య పరివారంతో మే నెలలో సింహగిరికి వచ్చిన ఆయన మూడు నెలల తరువాత బుధవారం ఒడిశాకు ప్రయాణమయ్యారు. మధ్యాహ్నం స్వామివారి పవళింపు సేవ తరువాత శిష్యులతో కలిసి అప్పన్నను దర్శించుకుని తన వద్ద మిగిలిన ధనాన్ని హుండీలో వేశారు. రాజగోపురం మీదుగా దిగుతూ తన వద్ద ఉన్న మిగులు ధనాన్ని నిరు పేదలకు పంచిపెట్టారు. అనంతరం కొండదిగువకు చేరుకుని ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులను కలిసారు.

స్వామివారి సన్నిధిలో ఆధ్యాత్మికవేత్తలు

ఒడిశాలోని పూరీ ప్రాంతానికి చెందిన ఆత్మనాత్యానంద గిరి స్వామీజీ, హరిద్వార్‌కు చెందిన మహారాజ్ నిరంజని అఖండ స్వామీజీ బుధవారం వరాహలక్ష్మీనృసింహ స్వామిని దర్శించుకున్నారు. వారికి ఆలయ ప్రధానార్చకుడు శ్రీనివాసాచార్యులు పూర్ణకుంభంతో ఆహ్వానం పలికారు. బేడా మండప ప్రదక్షిణ తరువాత అంతరాలయంలో పూజలు చేసి శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. గోదాదేవి దర్శనం తరువాత పండితులు ఆశీర్వచనాలీయగా, ప్రధానార్చకులు ప్రసాదాలను అందజేశారు.

సర్వీసు రోడ్డు విస్తరణకు కొలతలు

మధురవాడ, ఆగస్టు 6 (ఆంధ్ర జ్యోతి):కారు షెడ్ నుంచి కొమ్మాది కూడలి వరకు సర్వీసు రోడ్డు ఇరు గ్గా ఉండడంతో వాహనదారులు నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు ఎదు ర్కొంటున్నార. ఈవిషయాన్ని స్థానిక నాయకులు ఎమ్మెల్యే గంటా దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన రోడ్డు విస్తరణకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈమేరకు బుధవారం చంద్రంపాలెం వద్ద డివైడర్‌కు కొలతలు వేశారు. డివైడర్ వెడల్పు కొంతమేర తగ్గిస్తే రోడ్డు విస్తరణ జరిగి ట్రాఫిక్ ఇబ్బం దులు ఉండవని అధికారులు భావిస్తున్నారు. ఈ కార్యక్రమంలో జోన్-2 జడ్సీ కనక మహాలక్ష్మి, పీఎంపాలెం ట్రాఫిక్ సీఐ సాయి, ఎస్ఐ బాలకృష్ణ, కార్పొరేటర్ మంగమ్మ, టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి వెంకటరావు, కూటమి నాయకులు అచ్చుతరావు, సూర్యప్రకాశరావు, శివాజీ, రాము, కృష్ణ తదితరులు ఆధ్వర్యంలో విస్తరణకు కొలతలు వేశారు.

'ప్రభుత్వ వైఫల్యాలపై ప్రచారం చేయండి'

భీమునిపట్నం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ వైఫల్యాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని వైసీపీ భీమిలి నియోజకవర్గం ఇన్‌చార్జి మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) పిలుపునిచ్చారు. బుధవారం ఆయన బీచ్ రోడ్‌లో ఉన్న రిసార్టులో 1,2,3,4 వార్డుల కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. ఏడాది పాలనపై కూటమి నాయకులు ప్రజలకు ఏం చేశారన్నది చెప్ప లేకపోతున్నారని విమర్శించారు. మూడో వార్డు వైసీపీ అధ్యక్షుడు అల్లిపిల్లి నరసింగరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కార్పొరేటర్ దౌలపల్లి ఏడుకొండలరావు, నాయకులు అక్కరమాని రామునాయుడు, కరుణాకర్‌రెడ్డి, షణ్ముఖరావు, భాస్కర్‌రెడ్డి, ప్రసాద్, పాల్గొన్నారు.

హోటళ్లు, బేకరీలపై కేసులు

... 5వ పేజీ తరువాయి

నిర్వహించాయన్నారు. తొలిరోజు హోటళ్లలో నిల్వ ఉన్న 125 కిలోల ఆహారాన్ని గుర్తించి నాశనం చేశామని, నిబంధనలు ఉల్లఘించిన వారిపై కేసులు నమోదు చేశామన్నారు. అలాగే రెండో రోజు బేకరీలు, స్వీట్స్ దుకాణాల్లో సోదాలు చేసి నిల్వ ఉన్న, గడువు తీరిన 50 కిలోల ఆహార పదార్థాలను నాశనం చేసినట్టు తెలిపారు. 16 కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. మొత్తమ్మీద 39 నమూనాలు సేకరించి హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపించామని, రిపోర్టులను బట్టి ఆయా హోటల్స్, రెస్టారెంట్లు, షాపులపై చర్యలు తీసుకుంటామన్నారు. కలర్స్ వినియోగించిన ఆహార పదార్థాల వినియోగానికి ప్రజలు దూరంగా ఉండాలన్నారు. తూనికలు, కొలతల శాఖ డిప్యూటీ కంట్రోలర్ థామస్ రవికుమార్ మాట్లాడుతూ 24 చోట్ల తూకాలను ముద్రణ లేకుండా వినియోగిస్తున్నట్టు గుర్తించి కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. ప్యాకేజీ నిబంధనలు ఉల్లంఘించడంతో మరో 18 కేసులు నమోదు చేసినట్టు వెల్లడించారు. రెండు రోజుల్లో మొత్తం 58 కేసులు నమోదుచేశామన్నారు. సమావేశంలో ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లు పి.శ్రీను, ఎస్.ఆనందరావు పాల్గొన్నారు.



మిల్లు ప్రతినిధులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

జూట్ కార్మికులకు త్వరలో పరిహారాల చెల్లింపు

- ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

తగరపువలస, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : చిట్టివలస జూట్‌మిల్లు కార్మికుల పరిహారాల సమస్య త్వరలోనే పరిష్కారం అవుతుందని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఆయన ఎంవీపీ కాలనీలో ఉన్న తన క్యాంప్ కార్యాలయంలో కార్మిక సంఘాల నాయకులు, మిల్లు యాజమాన్య ప్రతినిధులు, కార్మిక శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. తొలుత మిల్లు ప్రతినిధులు మాట్లాడుతూ సీనియారిటీని అనుసరించి పించన్ వస్తుందని, ఫిక్స్‌డ్ డిపాజిట్లు చెల్లించడానికి యాజమాన్యం సిద్ధంగా ఉందని తెలిపారు. బకాయిల మొత్తాన్ని లెక్కగట్టి దానికి రెండు రెట్లు విలువైన భూమిని హామీగా ఉంచుకుని మిగిలిన భూమిని అటాచ్‌మెంటు నుంచి తప్పించాలని కోరారు. భూములు అమ్మితే తప్ప బకాయిలు చెల్లించలేనని చెప్పారు. ఈ విషయాన్ని కార్మికులతో చర్చించి తెలియజేస్తామని కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ అవినాష్ కుమార్ మాట్లాడుతూ కార్మికుల బకాయిలకు సంబంధించిన సొమ్ము తమ ఖాతాలో ఉందని దాన్ని చెల్లించడానికి ఎటువంటి ఇబ్బంది లేదన్నారు. ఈ సమావేశంలో జాయింట్ లేబర్ కమిషనర్ రామారావు, యాజమాన్యం తరఫున బజోరియా లలిత్‌మోహన్, రామ్‌కుమార్, కార్మిక సంఘాల తరఫున పడాల రమణ, నవర రామారావు, అచ్చారావు, గురుమూర్తి, దల్లి అప్పలరెడ్డి, మునకాల ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి పాలవలస ఎంపీటీసీ సభ్యురాలు

ఆనందపురం : మండలంలోని పాలవలస ఎంపీటీసీ సభ్యురాలు రౌతు శ్యామలతో పాటు పలువురు వైసీపీ నాయకులు బుధవారం టీడీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు రామవరంలో జరిగిన కార్యక్రమంలో కండువాలు వేసి, పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో పాలవలస ఉప సర్పంచ్ చందక ఎల్లారావు, వార్డు సభ్యురాలు నిమ్మల లక్ష్మి, సీనియర్ నాయకులు రౌతు వెంకటరావు, మదపాడ శ్రీను, కంచుబోయిన తమ్మునాయుడు, పేడా శంకరరావు ఉన్నారు.

క్రాస్ ఓటింగ్!

... 5వ పేజీ తరువాయి

తీవ్రస్థాయికి పెరిగిపోయింది. ప్రధానంగా జనసేనకు చెందిన కొందరు కార్పొరేటర్లు కూటమి ఎమ్మెల్యేలు, పాలకవర్గంలోని పెద్దల తీరుపై ఆగ్రహంతో ఉన్నారు. జనసేనకు చెందిన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్‌కు, ఆ పార్టీకి చెందిన ఒక ఎమ్మెల్యేకు ప్రత్యక్షంగానే వార్ నడుస్తోంది. ఇద్దరూ ఒకరిపై ఒకరు అధిష్ఠానానికి ఫిర్యాదు చేసుకుంటున్నారు. కూటమి నేతలుగానీ, పాలకవర్గం పెద్దలుగానీ తనకు కనీసం సహాయం అందించడం లేదని మూర్తియాదవ్ అసంతృప్తితో ఉన్నారు. జనసేన స్థానిక నాయకత్వం తీరుకు నిరసనగా స్టాండింగ్ కమిటీ ఎన్నికను బహిష్కరిస్తున్నట్టు ఆయన ప్రకటించారు. మరోవైపు బెహరా భాస్కరరావు మేయర్ ఉప ఎన్నికకు ముందు వైసీపీ నుంచి జనసేనలో చేరారు. ఆ సమయంలో తనకు ఇచ్చిన హామీలను కూటమి నేతలు నెరవేర్చలేదని, స్థానిక టీడీపీ నేత నుంచి తనకు అవమానాలు ఎదురవుతున్నాయంటూ బహిరంగంగానే నేతల వద్ద అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. బుధవారం జరిగిన స్టాండింగ్ కమిటీ ఎన్నికకు ఆయన కుటుంబంలోని ఇద్దరు కార్పొరేటర్లు గైర్హాజరవ్వడానికి కారణం అదేనని కూటమి నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. ఇండిపెండెంట్‌గా గెలిచి జనసేనలో చేరిన కార్పొరేటర్ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులకు ఓటు వేయాలని కోరుతూ మెసేజ్‌లు పెట్టినట్టు టీడీపీ కార్పొరేటర్లు చెబుతున్నారు. మరోవైపు వైసీపీ నుంచి జనసేన, టీడీపీల్లో చేరిన కార్పొరేటర్లు ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల వ్యవహారశైలిపై అసంతృప్తితో ఉన్నారు.తాము పార్టీ మారినప్పటికీ ఇప్పటికీ వైసీపీ కార్పొరేటర్లుగానే భావిస్తున్నారని, తమ చేతిలో ఓటమి పాలైన వారిని వార్డుల్లో కార్యక్రమాలకు పిలిచి తమను అవమానపరుస్తారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వారిలో కొందరు వైసీపీకి అనుకూలంగా ఓటేసి ఉంటారని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. టీడీపీకి చెందిన కొందరు కార్పొరేటర్లు సైతం ప్రస్తుతం పాలకవర్గంలోని నేతల తీరుపై గుర్రుగా ఉన్నారని, వారు కూడా స్టాండింగ్ కమిటీ ఎన్నికలో క్రాస్ ఓటింగ్‌కు పాల్పడ్డారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కూటమి ఎమ్మెల్యేలు కూడా తమ నియోజకవర్గాల పరిధిలోని కొందరు కార్పొరేటర్ల తీరుపై ఆగ్రహంతో ఉన్నారు. అందుకే స్టాండింగ్ కమిటీ ఎన్నికల గురించి పట్టించుకోలేదని, అది కూడా పోలింగ్‌పై ప్రభావం చూపి, అభ్యర్థి ఓటమికి కారణంగా మారిందని అంటున్నారు.

కూటమికి 9, వైసీపీకి 1

... 5వ పేజీ తరువాయి

జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్; సీపీఎం కార్పొరేటర్ బి.గంగారావు, ఆరో వార్డు కార్పొరేటర్ ముత్తంశెట్టి ప్రియాంక, 91వ వార్డు కార్పొరేటర్ కుంచెజోత్స్న, 92వ వార్డు కార్పొరేటర్ బెహరా వెంకట స్వర్ణలత ఓటింగ్‌కు హాజరుకాలేదు. 92 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. వీరిలో వైసీపీకి 32 మంది కార్పొరేటర్లు మద్దతు ఉండగా, మిగిలిన 60 మంది టీడీపీ, జనసేన, బీజేపీకి చెందినవారు ఉన్నారు. మధ్యాహ్నం మూడు గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభించారు. రౌండ్‌కు 24 ఓట్లు చొప్పున నాలుగు రౌండ్లలో లెక్కింపు జరిగింది. నాలుగురౌండ్‌ల లెక్కింపు పూర్తయ్యేసరికి కూటమి మద్దతుతో పోటీ చేసిన కొణతాల నీలిమకు 58, గంకల కవితకు 57, దాడి వెంకటరామేశ్వరరావుకు 57, మొల్లి హేమలతకు 57, సేనాపతి వసంతకు 54, గేదెల లావణ్యకు 53, మాదంశెట్టి చినతల్లికి 52, రాపర్తి త్రివేణివరప్రసాదరావుకి 52, మొల్లి ముత్యాలకు 51 ఓట్లు రాగా వైసీపీకి చెందిన సాడి పద్మారెడ్డికి 50 ఓట్లు లభ్యమవడంతో వారంతా గెలుపొందినట్టు అధికారులు తేల్చారు. కూటమి మద్దతుతో పోటీకి దిగిన టీడీపీకి చెందిన 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావుకు 49 ఓట్లు రావడంతో రీకౌంటింగ్‌కు కూటమి నేతలు పట్టుబట్టారు. దీంతో అధికారులు మరోసారి ఓట్ల లెక్కించగా అదే ఫలితం వచ్చింది. ఆ సమయంలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు కేకేరాజు, వైసీపీ ఫ్లోర్‌లీడర్ బాణాల శ్రీనివాసరావు, మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ తదితరులు కమిషనర్ కేతన్‌గార్గ్‌ను కలిసి తమ అభ్యర్థికి 50 ఓట్లు వచ్చినా గెలుపును ప్రకటించడంలో జాప్యంచేస్తున్నారని, తక్షణం జోక్యంచేసుకోవాలని కోరారు. దీంతో కమిషనర్ ఓట్ల లెక్కింపు జరుగుతున్న హాల్‌కు వెళ్లి నాలుగు రౌండ్ల ఓట్లను పరిశీలించారు. అనంతరం అత్యధికంగా ఓట్లు సాధించిన పది మందిని గెలుపొందినట్టు ప్రకటించారు.

ఏయూ శతాబ్ది ఉత్సవాలకు షెడ్యూల్

... 5వ పేజీ తరువాయి

వర్క్‌షాప్. 24 నుంచి 26 వరకు తత్వశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'ఎక్స్‌ప్లోరింగ్ ద ఫిలాసఫికల్ లెగసీ ఆఫ్ ప్రొఫెసర్ సచ్చిదానందమూర్తి' అనే అంశంపై ఇంటర్నేషనల్ సెమినార్. 26, 27 తేదీల్లో బయో కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో టీఎంసీ-2025 కాన్ఫరెన్స్. అక్టోబరు రెండు, మూడు తేదీల్లో సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో జియో టెక్నికల్ ఇన్వెస్టిగేషన్‌పై వర్క్‌షాప్. ఏడో తేదీ నుంచి తొమ్మిదో తేదీ వరకు కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో రీసెంట్ అడ్వాన్సెస్ ఇన్ కెమికల్ ఫార్మాస్యూటికల్ అండ్ లైఫ్ సైన్సెస్ అంశంపై జాతీయ వర్క్‌షాప్ నిర్వహణ. 22న ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌పై వర్క్‌షాప్. అక్టోబరు 25 నుంచి 28వ తేదీ వరకు రీజనల్ వాలీబాల్ కోచింగ్ వర్క్‌షాప్‌ను అర్జున, ద్రోణాచార్య అవార్డు గ్రహీత డీఈ శ్రీధరన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. 27 నుంచి 31వ తేదీ వరకు గణిత శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో క్వాంటం కంప్యూటింగ్ కమ్యూనికేషన్స్ ప్రోటోకాల్ అండ్ క్రిప్టోగ్రఫీ అంశంపై వర్క్‌షాప్. క్లస్టర్ విధానంలో భాగంగా ఎలక్ట్రికల్ సైన్స్, మెకానికల్ సైన్స్, నేచురల్ సైన్స్, సోషల్ సైన్స్, లా మేనేజ్‌మెంట్ అంశాల్లో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించాలని నిర్ణయించారు. వీటితో పాటు ఏయూ అనుబంధ కళాశాలలను ఒక సమూహంగా ఏర్పాటు చేసి రూరల్ ఔట్‌రీచ్ కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.

నిత్యాన్న ప్రసాద పథకానికి రూ. లక్ష విరాళం

సింహాచలం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : అప్పన్న దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి హైదరాబాద్‌కు చెందిన కె. సుబ్బారెడ్డి రూ. లక్ష విరాళంగా సమర్పించారు. విరాళాన్ని చెక్ రూపంలో దేవాలయ ప్రజా సంబంధాల పర్యవేక్షణాధికారి వెంకటేశ్వరరావుకు బుధవారం అందజేశారు.

శ్మశాన వాటికకు కనీస సదుపాయాలు కరవు

- తుప్పలతో నిండిపోయి అధ్వానంగా పరిసరాలు
- సరైన రహదారి సౌకర్యం కూడా లేని పరిస్థితి
- మృతదేహం తీసుకెళ్లడానికి ఇబ్బందికర పరిస్థితి
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



రహదారి సదుపాయం లేని శ్మశాన వాటిక



తుప్పల మధ్యలో నుంచి మృతదేహాన్ని మోసుకువెళ్తున్న స్థానికులు

వెంకోజీపాలెం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు మారుతున్నాయి.. ప్రజా ప్రతినిధులు మారుతున్నారు... అధికారులు మారుతున్నారు... కానీ 15వ వార్డులోని శ్మశానవాటికలో కనీస సదుపాయాల గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. నిండా దట్టంగా పెరిగిన తుప్పలు, కనీస సదుపాయాలు కరువు, అధ్వానంగా తయారైన పరిసరాలతో శ్మశాన వాటిక నిండిపోయింది. మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు సరైన మార్గం కూడా లేని దుస్థితి. దశాబ్దాల నుంచి ఉన్న ఈ శ్మశాన వాటికలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టకపోవడంతో అధ్వానంగా తయారైంది.

జీవీఎంసీ 15వ వార్డులోని పాత వెంకోజీపాలెంలో ఉన్న అత్యధికంగా ఉన్న గవర కులస్థులు, రెడ్డీలు, ఎస్సీలు ఈ శ్మశాన వాటికనే ఉపయోగిస్తుంటారు. కొత్త, పాత వెంకోజీపాలెంలకు చెందిన గ్రామ సేవా సంఘం, శ్రీసీతా రామ సేవా సంఘం వారు వినియోగించే ఈ స్మశాన వాటికను అభివృద్ధి చేయటానికి అనేక మంది నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులు పలుసార్లు ప్రయత్నించారు. కానీ ఈ స్మశానవాటికకు రోడ్డు మార్గం, అసంపూర్ణంగా ఉన్న కాలువ నిర్మాణాన్ని కూడాచేపట్టలేకపోయారు. 2014లో టీడీపీ ప్రభుత్వ హయాంలో శ్మశానవాటికకు ఆనుకుని కొంత వరకు కాలువను మాత్రం నిర్మించగలిగారు. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ శ్మశాన వాటికను అభివృద్ధి చేసేందుకు తమ వంతు ప్రయత్నం చేసింది. కానీ ఇక్కడున్న సాధుమఠం వారు అభ్యంతరం లేవనెత్తడంతో ఆ ప్రయత్నాన్ని వదిలేశారు. మెయిన్ రోడ్డుపై నుంచి శ్మశాన వాటికకు కనీసం 300 మీటర్లు లోపలికి వెళ్లాలి. అయితే ఈ మార్గమంతా తుప్పలతో నిండిపోయి ఉంటుంది. తుప్పలనుదాటుకుంటూ మృతదేహాన్ని తీసుకువెళ్లాల్సిందే. ఒక వేళ ఎవరైనా తుప్పలు తొలగించి కాస్తంతా శుభ్రం చేస్తే ఇటువైపు వెళ్లే వారు బహిర్భూమిగా వాడుకుంటున్నారు.ఇది చాలదన్నట్టు.. ఈ ప్రాంతం నిర్మానుష్యంగా ఉండడంతో రాత్రీ పగలు అన్న తేడా లేకుండా గంజాయి బ్యాచ్‌లు వీర విహారం చేస్తుంటాయి. ఈ శ్మశాన వాటిక అభివృద్ధి గురించి ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవాలని ఇరు సంఘాలు, స్థానికులు కోరుతున్నారు.

అల్లూరి పోరాటస్ఫూర్తిని సజీవంగా ఉంచాలి

- ఏఐడీఎస్వో ప్రతినిధుల డిమాండ్



ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఆందోళన చేస్తున్న ఏఐడీఎస్వో ప్రతినిధులు

డాబాగార్డెన్స్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): అల్లూరి పోరాట స్ఫూర్తిని సజీవంగా ఉంచాలని ఆలిండియా డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ (ఏఐడీఎస్వో) నాయకులు డిమాండ్ చేశారు. అల్లూరి సీతారామరాజు పోరాట స్ఫూర్తికి సాక్ష్యాలుగా నిలిచిన అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలోని బ్రిటిష్ సైనికాధికారుల సమాధుల స్థలం ఆక్రమణను అడ్డుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం విశాఖపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఏఐడీఎస్వో నగర కమిటీ ఆందోళన చేపట్టింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భావితరాల కోసం స్వాతంత్య్ర సమర యోధుల పోరాటాన్ని, వారి స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. నర్సీపట్నంలో ఉన్న బ్రిటిష్ సైన్యాధికారులు స్కాట్‌కోవర్డ్, హైటర్ సమాధులు చారిత్రక కట్టడాలు మాత్రమే కాదన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో అల్లూరి, ఆయన అనుచరుల వీరోచిత పోరాటాలకు అవి సజీవ సాక్ష్యాలన్నారు.

అటువంటి ప్రాధాన్యత ఉన్న స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడం దారుణమన్నారు. ఈ చారిత్రక సమాధుల స్థలం ఆక్రమణలను వెంటనే అడ్డుకోవాలన్నారు. ఈ స్థలాన్ని పురావస్తుశాఖకు అప్పగించి సంరక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐడీఎస్వో జిల్లా అధ్యక్షుడు కె.అభిలాష్, విద్యార్థులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు స్పీచ్ థెరపీ



తోటగరువు భవిత కేంద్రంలో విద్యార్థులకు స్పీచ్ థెరపీ నిర్వహిస్తున్న దృశ్యం

ఆరిలోవ, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : తోటగరువులోని భవిత కేంద్రంలో గల 25 మంది మూగ దివ్యాంగ విద్యార్థులకు స్పీచ్ మెలకువలను స్పీచ్ థెరపిస్ట్ బాలేశ్వరి నేర్పించారు. భాష ఉచ్ఛరణ ఎలా ఉండాలి అనే అంశాలపై ఆమె అవగాహన కల్పించారు. అవసరమైన పిల్లలందరకూ జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో గల విద్యార్థులకు థెరపీ అందించనున్నట్టు ఆమె తెలిపారు. విద్యార్థుల్లో లోపాలను గుర్తించి వారికి కొంత తర్ఫీదు ఇవ్వడం ద్వారా సక్రమంగా మాట్లాడే విధంగా ప్రయత్నించడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు సీహెచ్ రవీంద్రబాబు, పి.అనూరాధ, పాఠశాల ప్రాధానోపాధ్యాయురాలు నజ్మా, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్‌గా 'కురిమిన' బాధ్యతల స్వీకారం



పదవీ బాధ్యతలు స్వీకరించిన రామస్వామి, సభ్యులు

భీమునిపట్నం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కురిమిన రామస్వామినాయుడు బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. అలాగే పలువురు కమిటీ సభ్యులు కూడా బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి డైరెక్టర్ పంచకర్ల సందీప్, ఒకటవ వార్డు అధ్యక్షురాలు పరిమి భువనేశ్వరి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు రామలక్ష్మీ నాయుడు, తారకేష్, శ్రీను, సత్తిబాబు, రమణ, రమేష్, చిన్న తదితరులు పాల్గొన్నారు.

పార్వతీనగర్‌లో 'సుపరిపాలనలో తొలి అడుగు'



స్థానికులకు కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

ఆరిలోవ, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని బుధవారం 11వ వార్డులోని పార్వతీనగర్‌లో నిర్వహించారు. టీడీపీ వార్డు ఇన్‌చార్జి రాగతి అచ్యుతరావు, అధ్యక్షుడు ముగడ రాజారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పాల్గొని ఇంటింటికీ వెళ్లి ఈ ఏడాది కాలంలో చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తామన్నారు.

కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు, యువనాయకుడు వెలగపూడి ప్రతాప రుద్ర. టీడీపీ 11 వార్డు కార్యదర్శి పేపరునాయుడు, టీడీపీ సీనియర్ నాయకులు మూది అప్పారావు, పచ్చిపాల శ్రీను, సబ్బవరపు అప్పలనాయడు,, గాడి సత్యం, ఏడువాక సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

కాలువలో పూడిక.. పరిసరాలు దుర్గంధం



ఆదర్శనగర్ పైడిమాంబ గుడి సమీపంలో పూడికతో నిండిన ప్రధాన కాలువ

ఆరిలోవ, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : ఆదర్శనగర్ జాతీయ రహదారి కూడలి సమీపంలో గల పైడిమాంబ అమ్మవారి ఆలయానికి సమీపంలో గల ప్రధాన కాలువ పూడికతో నిండిపోయి ఉంది. దీంతో ఎక్కడ మురుగు నీరు అక్కడే నిలిచి కాలువ నుంచి తీవ్ర దుర్వాసన వెలువడుతోంది. దీనివల్ల గుడికి వచ్చే భక్తులు ఇబ్బంది పడుతున్నారు. ఈ గుడికి రోజూ వందలాది మంది భక్తులు వస్తుంటారు. కాలువలో మురుగునీరు నిల్వ ఉండిపోవడంతో దోమలు ఎక్కువగా ఉన్నాయి. కాలువకు ఆనుకొని సుమారు 40 వరకు వివిధ దుకాణాలు ఉన్నాయి. అక్కడ మాంసం దుకాణాలు ఉండడంతో ఆ వ్యర్థాలను కాలువలోనే పడేస్తున్నారు. అలాగే చిన్న హోటల్స్ నిర్వాహకులు కూడా మిగిలిన, పాడైన ఆహారాన్ని కాలువలోనే పడేస్తుండడంతో.. అవన్నీ బాగా కుళ్లి తీవ్ర దుర్గంధం వెలువడుతోంది.

ఈ విషయమై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా జీవీఎంసీ పారిశుధ్య విభాగం అధికారులు, సిబ్బంది పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువలో పేరుకుపోయిన పూడిక తొలగింపునకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అలరించిన కవి సమ్మేళనం



సమావేశంలో మాట్లాడుతున్న సహృదయ సాహితి అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్

సీతంపేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): సీతంపేట రాజేంద్రనగర్‌లోని ప్రిజమ్ డిగ్రీ కళాశాలలో సహృదయ సాహితి ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన కవి సమ్మేళనం ఆహూతులను అలరించింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సహృదయ సాహితి అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజల హృదయాల్లో కవి ఉదయించి, ప్రకృతి ఒడిలో క్రాంతి బాలుడ్ని ప్రసరిస్తాడన్నారు. జన హృదయాల్లో వికసించే ఆత్మీయ శక్తి కవి అని పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సాహితి విశ్లేషకుడు డాక్టర్ డి.వి. సూర్యారావు కవితలు వినిపించి కవితా రీతులను ఆవిష్కరించారు. ఈ సమ్మేళనంలో సీహెచ్ చిన సూర్యనారాయణ, వినయభూషణ్, డాక్టర్ కేవీఎన్ మూర్తి, కుప్పిలి భీమేశ్వరరావు, చల్లా రాంబాబు, పరమేశ్వరరావు, భాగవతుల సత్యనారాయణ మూర్తి, రావి మోహన్, ఉప్పల అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల పక్కనే అపరిశుభ్రత

- చెత్తతో నిండిన డంపర్‌బిన్ తొలగింపులో పారిశుధ్య సిబ్బంది నిర్లక్ష్యం



స్కూలు గోడకు ఆనుకొని గుట్టలుగా పడి ఉన్న చెత్త

ఆరిలోవ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : తోటగరువు హైస్కూలు ప్రహరీ గోడకు అనుకొని జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది డంపర్‌బిన్ ఏర్పాటు చేశారు. ఇది ప్రస్తుతం చెత్తతో పూర్తిగా నిండిపోయింది. అయినప్పటికీ చెత్త వేస్తుండడంతో ఆ చెత్త కింద పడిపోయి పరిసరాలు అధ్వానంగా తయారయ్యాయి. కుక్కలు, పందులు ఆ చెత్తను చెల్లాచెదురు చేస్తుండడంతో అటువైపుగా పాదచారులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడుతున్నారు. కొంతమంది పాడైన పరుపులు కూడా ఇక్కడే వేయడంతో అక్కడి వాతావరణం డంపింగ్ యార్డులా తయారైంది. కొంతమంది చెత్తను తీసుకొచ్చి హైస్కూలు గోడలకు ఆనుకొని వేస్తున్నారు. దీని నుంచి వస్తున్న దుర్వాసనకు విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు. జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది ఇక్కడి డంపర్‌బిన్‌ను తరలించాలని పలువురు కోరుతున్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్ల ఎంపిక



కృష్ణా కళాశాలలో ఎన్‌సీసీ క్యాడెట్స్‌ను ఎంపిక చేస్తున్న అధికారులు

మద్దిలపాలెం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం విద్యార్థులు నేషనల్ క్యాడెట్ కోర్ (ఎన్‌సీసీ)లో చేరేందుకు ఎంపికలు నిర్వహించారు. 13(ఎ) బీఎన్ ఎన్‌సీసీకి చెందిన అధికారులు శంకర్, సుబేదార్, శోభన్, నాయుడు, కళాశాల ఎన్‌సీసీ లెఫ్టినెంట్ సన్యాసినాయుడు విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. అనంతరం శారీరక దారుఢ్యం, ఎత్తు ఎంపికలు చేశారు. ఈ ఎంపికల్లో 18 మంది బాలురు, 15 మంది బాలికలు ఎన్‌సీసీ క్యాడెట్స్‌గా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ బి.సుజాత మాట్లాడుతూ కళాశాల స్థాయిలో నిర్వహించే ఎన్‌సీసీ శిక్షణ దేశంలోని త్రివిధ సైనిక దళాల్లో చేరడానికి దోహదపడుతుందన్నారు.ఎన్‌సీసీతో కర్తవ్యం, ఐక్యత, క్రమశిక్షణ, దేశభక్తి వంటి మంచి లక్షణాలు అలవడుతాయని తెలిపారు.

సింహగిరిపై అధిక ధరలకు అమ్మకాలు

- భక్తుల ఫిర్యాదు

సింహాచలం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : సింహగిరిపై పలువురు వ్యాపారులు అధిక ధరలకు సరకులు విక్రయిస్తున్నారు. నగరానికి చెందిన కానిస్టేబుల్ పి. రామారావు బుధవారం తన కుటుంబ సభ్యులతో కలిసి అప్పన్నస్వామి దర్శనానికి వచ్చారు. దర్శనం అనంతరం కూల్ డ్రింక్ తాగేందుకు గిరిజన గ్రామంలోని పాన్‌షాపునకు వెళ్లగా యజమాని ఎంఆర్‌పీ కంటే రూ.5 అధికంగా అడిగారు. ఎందుకని ప్రశ్నించగా యజమాని నుంచి దురుసు సమాధానం రావడంతో పీఆర్వో కార్యాలయంలో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అనేక దుకాణాల్లో ఇదే పరిస్థితి ఉందని భక్తులు ఆరోపిస్తున్నారు.

మట్టి తరలిస్తున్న లారీ స్వాధీనం

పద్మనాభం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మద్ది గ్రామంలో మట్టి అక్రమంగా తరలిస్తున్న లారీని గనులు, భూగర్భ వనరుల శాఖాధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. మట్టి అక్రమ రవాణాపై తమకు వచ్చిన సమాచారం మేరకు వారు తనిఖీలు నిర్వహించగా లారీతో మట్టి రవాణా చేస్తుండగా మద్ది గ్రామం వద్ద పట్టుకున్నారు. లారీని సీజ్ చేసి పద్మనాభం పోలీసులకు అప్పగించారు. నివేదిక తయారు చేసి తదుపరి చర్యల నిమిత్తం తహసీల్దార్‌కు పంపించారు. తహసీల్దార్ కేసు నమోదు చేయాల్సిందిగా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సినిమా గైడ్

- **సార్, మేడమ్** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **కింగ్డమ్** : జగదాంబ
- **సన్ ఆఫ్ సర్దార్** : రమాదేవి
- **మహావతార్ నరసింహ** : సంగం, కిన్నెర, వెంకటేశ్వర-1, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)
- **హరిహర వీరమల్లు** : శారద, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శ్రీరామా, కామేశ్వరి, శ్రీకన్య, శ్రీకాంతి, సౌజన్య, సుకన్య (గోపాలపట్నం), మౌర్య, నటరాజ్ (పెందుర్తి). మోహిని, మినీ మోహిని (గాజువాక), శ్రీకన్య, కన్య, హెవెన్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 48, వంకాయలు (తెలుపు) 26, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 38, పచ్చిమిర్చి 60, కాకరకాయలు 32, బీరకాయలు 42, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 34, క్యాబేజి 16, క్యారెట్ 46, దొండకాయలు 40, బంగాళదుంపలు 18, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 40, అల్లం (పాతది) 74, బరబాటి 32, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 55, బద్దచిక్కుడు 50, దోస కాయలు 22, వె ల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 84, కీరదోస 32, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 36, చిలగడదుంపలు 48, కంద 42, దేముడు చిక్కుడు 102, గోరు చిక్కుడు 38, కూర పెండలం 26, బ్రకోలి 45, పనస పొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 36, జామ కాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	85
లైవ్ ధర	105
విత్ స్కిన్	180
స్కిన్‌లెస్	190

కళలే దేశ సంస్కృతికి పట్టుగొమ్మలు

- సెంచూరియన్ యూనివర్సిటీ ఉపకులపతి జీఎస్ఎన్ రాజు



కూచిపూడి కళాకారిణి విజయజ్యోతికి ఉషా జీవితసాఫల్య అవార్డు ప్రదానం చేస్తున్న పైడా కృష్ణప్రసాద్

మద్దిలపాలెం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : భారతదేశ సంస్కృతికి కళలే పట్టుగొమ్మలని సెంచూరియన్ యూనివర్సిటీ ఉపకులపతి జీఎస్ఎన్ రాజు పేర్కొన్నారు. పిఠాపురం కాలనీ కళాభారతి ఆడిటోరియంలో బుధవారం విశాఖ ఆర్ట్స్ అండ్ డాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గురువుకు వందనం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కళలు సంస్కృతీసంప్రదాయాలే కాదని, మానసిక ఆరోగ్యానికి ఎంతోగానో దోహదపడతాయన్నారు. కళలను ఆదరించి కళాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గురుపౌర్ణమిని పురస్కరించుకుని గురువుకు వందనం పేరిట గురువులకు సత్కారం చేసే ఇలాంటి కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం కూచిపూడి కళాకారిణి విజయజ్యోతికి సామాజిక కార్యకర్త ఉషా జీవితసాఫల్య అవార్డును పైడా కృష్ణప్రసాద్ చేతుల మీదుగా ప్రదానం చేశారు. అలాగే 22 మంది గురువులకు సత్కరించారు. ఈ సందర్భంగా నాట్యకళాకారులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో డాక్టర్ శ్రీధర్‌మిత్ర, విశాఖ ఆర్ట్స్ అండ్ డ్యాన్స్ అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి కన్నం వెంకటరమణారావు, అధ్యక్షుడు హరిరామమూర్తి, సింధుజ గోపీనాథ్, మహాలక్ష్మి, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ మేయర్-2పై అవిశ్వాస తీర్మానం

- లేఖపై 49 మంది కూటమి కార్పొరేటర్ల సంతకాలు

విశాఖపట్నం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ డిప్యూటీ మేయర్-2 కట్టమూరి సతీష్‌పై అవిశ్వాస తీర్మానం నోటీసు ఇవ్వాలని కూటమి నేతలు నిర్ణయించారు. సతీష్ ఎన్నికై గతనెల 31నాటికి నాలుగేళ్లు పూర్తయింది. దీంతో అవిశ్వాసం పెట్టడానికి చట్ట ప్రకారం వీలుంది. ఈ మేరకు సిద్ధం చేసిన లేఖపై బుధవారం 49 మంది కార్పొరేటర్లు సంతకాలు చేశారు. మరో ఐదుగురు సంతకం చేయాల్సి ఉండగా, స్టాండింగ్ కమిటీ ఎన్నిక కారణంగా దీనిపై దృష్టిసారించడానికి అవకాశం లేకుండా పోయింది. వారంతా సంతకాలు చేశాక కలెక్టర్‌కు లేఖ అందజేయనున్నారు.

అంతరాలయంలో అప్పన్న ఆర్జిత సేవలు జరపాలి

సింహాచలం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : వరాహ లక్ష్మీనృసింహస్వామి అంతరాలయంలో ఆర్జిత సేవలను పునరుద్ధరించాలని భక్తులు కోరుతున్నారు. ఐదేళ్ల క్రితం కరోనా వల్ల రాష్ట్ర ప్రభుత్వం అంతరాలయంలో ప్రతి గురు, ఆదివారం జరిగే స్వర్ణ పుష్పార్చన, స్వర్ణ తులసీ దళార్చన, లక్ష తులసీ దళార్చన, సహస్రనామార్చన సేవలను నిలిపివేసింది. రెండు నెలలు క్రితం నుంచి సాయంత్రం సహస్రనామార్చనను పునరుద్ధరించారు. మిగతా సేవలను కూడా అంతరాలయంలో పునరుద్ధరించాలని భక్తులు కోరుతున్నారు.

విద్యార్థుల ధ్యాస చదువుపైనే ఉండాలి

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు



బాలురతో మాట్లాడుతున్న సన్యాసి నాయుడు

ఆరిలోవ, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశలో ప్రతి ఒక్కరూ చదువుపైనే ధ్యాస నిలిపి బాగా చదువుకొని ప్రయోజకులు కావాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసి నాయుడు పేర్కొన్నారు. ఆయన దీనదయాళ్‌పురంలో గల ప్రత్యేక బాలుర గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ తరచూ ఆవేశాలకు లోనుకావడం, చదువును నిర్లక్ష్యం చేయడం చేయకూడదన్నారు. కేవలం చదువు మాత్రమే ఎవరికైనా ఉన్నత స్థితికి చేర్చగలదని గ్రహించాలన్నారు. ఏదైనా తప్పు చేస్తే దాని ప్రతిఫలం తప్పక ఎదురవుతుందని, దానివల్ల చదువుకు ఆటంకం, కొన్నిసార్లు జీవిత గమనమే మారిపోయే ప్రమాదం ఉందన్నారు. ఎల్లప్పుడ సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని, వాటిని అధిగమించేందుకు ప్రయత్నం చేస్తుండాలన్నారు. అలాగే ఆయన ప్రభుత్వ బాలుర గృహం, బాలుర ప్రత్యేక గృహాన్ని సందర్శించారు. ఆయన వెంట రెండు హోంల పర్యవేక్షణాధికారులు, సిబ్బంది ఉన్నారు.

ప్లాస్టిక్ నిర్మూలన అందరి లక్ష్యం కావాలి

- దక్షిణ కోస్తా రైల్వే జీఎం సందీప్ మాథుర్



ఈస్ట్‌పాయింట్ కాలనీలో శుభ్రం చేస్తున్న జీఎం సందీప్ మాథుర్, సౌత్ కోస్ట్ రైల్వే ఓఎస్‌డీ చంద్రశేఖర్

విశాఖపట్నం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రైల్వే మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు బుధవారం స్వచ్ఛ భారత్ అభియాన్ ప్రచార కార్యక్రమంలో సౌత్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ సందీప్ మాథుర్ పాల్గొన్నారు. ఈస్ట్ పాయింట్ కాలనీలో నిర్వహించిన స్వచ్ఛ భారత్ అభియాన్‌లో ఆయన పాల్గొని ప్రాంగణంలోని ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తా చెదారం తొలగించి నిబద్ధత చాటుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని నిర్మూలించడం, శాస్త్రీయపద్ధతిలో వ్యర్థాలను తొలగించడం ద్వారా పరిశుభ్రమైన వాతావరణం, ఆరోగ్యాన్ని పొందడంపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరముందన్నారు. పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా నిర్వహించడంలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రైల్వే మంత్రిత్వ ఆదేశాల మేరకు 15 రోజులపాటు భారతీయ రైల్వేలోని అన్ని ప్రాంగణాలలో స్వచ్ఛభారత్ అభియాన్ చేపడుతున్నామని పేర్కొన్నారు. అనంతరం పరిశుభ్రత ప్రమాణాలను కాపాడుకోవడంలో భాగంగా స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగస్వామ్యం కావాలని సౌత్ కోస్ట్ రైల్వే ఓఎస్‌డీ చంద్రశేఖర్‌తోపాటు అధికారులు, రైల్వే రక్షణ దళం, స్వచ్ఛ సేవలతో ప్రతిజ్ఞ చేయించారు.

పాఠశాల ముందు పార్కింగ్ తొలగింపు



పాఠశాల బయట కట్టిన బ్యానర్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మురళీనగర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 49వ వార్డు బర్మాక్యాంప్ శ్రీనివాసనగర్ రోడ్డులో ఉన్న జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల ముందు అనధికార పార్కింగ్‌ను తొలగించేలా ప్రధానోపాధ్యాయిని వసంతకుమారి చొరవ చూపారు. విద్యార్థుల రాకపోకలకు ఆటంకం కలిగేలా ఆటోలు, ద్విచక్రవాహనాలు, కార్లు ప్రవేశద్వారానికి అడ్డంగా పార్కింగ్ చేస్తున్న వైనంపై కొద్ది రోజుల క్రితం 'ఆంధ్రజ్యోతి'లో వార్త ప్రచురితమైంది. పాఠశాలకు మధ్యాహ్న భోజనం తీసుకువచ్చే 'అక్షయపాత్ర' వాహనాలకు కూడా చోటులేకుండా స్థలాన్ని ఆక్రమించారు. ఈ పరిస్థితిని చక్కదిద్దుతూ పాఠశాల ఎదుట వాహనాల్ని ఖాళీ చేయించారు. 'పాఠశాల ముందు వాహనాలను నిలపరాదు' అంటూ బ్యానర్‌ను ప్రహరీ వద్ద ఏర్పాటు చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ చర్యలపై ఆనందం వ్యక్తంచేశారు.

అలరించిన కవి సమ్మేళనం



సమావేశంలో మాట్లాడుతున్న శేఖరమంత్రి ప్రభాకర్, వేదికపై ఇతర ప్రముఖులు

సీతంపేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): సీతంపేట రాజేంద్రనగర్‌లోని ప్రిజమ్ డిగ్రీ కళాశాలలో సహృదయ సాహితి ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన కవి సమ్మేళనం ఆహూతులను అలరించింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సహృదయ సాహితి అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజల హృదయాల్లో కవి ఉదయించి, ప్రకృతి ఒడిలో క్రాంతి బాలుడ్ని ప్రసరిస్తాడన్నారు. జన హృదయాల్లో వికసించే ఆత్మీయ శక్తి కవి అని పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సాహితి విశ్లేషకుడు డాక్టర్ డి.వి. సూర్యారావు కవితలు వినిపించి కవితా రీతులను ఆవిష్కరించారు. ఈ సమ్మేళనంలో సీహెచ్ చిన సూర్యనారాయణ, వినయభూషణ్, డాక్టర్ కేవీఎన్ మూర్తి, కుప్పిలి భీమేశ్వరరావు, చల్లా రాంబాబు, పరమేశ్వరరావు, భాగవతుల సత్యనారాయణ మూర్తి, రావి మోహన్, ఉప్పల అప్పలరాజు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు నలుగురి ఎంపిక



ఎంపికైన విద్యార్థినులతో ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ, అధ్యాపక బృందం

కంచరపాలెం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాల శాండ్‌విచ్ డిప్లొమా విద్యార్థినులు ఇటీవల జరిగిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఉద్యోగాలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ పేర్కొన్నారు. తమ కళాశాల్లో చదువుతున్న నలుగురు విద్యార్థినులు ఎంపికయ్యారన్నారు. పెట్రో కెమికల్ బ్రాంచి నుంచి ఎన్.చంద్రజ్యోత్స్న, ఎన్.చరిష్మా ఎంపిక కాగా, కెమికల్ బ్రాంచి నుంచి ఎస్.కోమలి, ఆయిల్ టెక్నాలజీ నుంచి కె.ప్రతిభ ఎంపికయ్యారు. తమిళనాడు కాంచీపురం సమీపంలో గల ఆదిత్య బిర్లా గ్రూప్, ఓపస్ పెయింట్స్ కంపెనీల్లో వీరు ఉద్యోగాలు చేస్తారన్నారు. ఎంపికైన విద్యార్థినులకు ప్రారంభ వార్షికవేతనం రూ.3.3 లక్షలు ఇస్తారన్నారు. విద్యార్థినులను ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ, జయప్రకాశ్ రెడ్డి, డాక్టరు ఎస్.ప్రశాంత కుమారి, డి.దామోదర్, ఎం.మహాలక్ష్మి, డా.ఎం.విజయలక్ష్మి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

శతాబ్ది ఉత్సవాల షెడ్యూల్

... 5వ పేజీ తరువాయి

వర్క్‌షాప్. 24 నుంచి 26 వరకు తత్వశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'ఎక్స్‌ప్లోరింగ్ ద ఫిలాసఫికల్ లెగసీ ఆఫ్ ప్రొఫెసర్ సచ్చిదానందమూర్తి' అనే అంశంపై ఇంటర్నేషనల్ సెమినార్. 26, 27 తేదీల్లో బయో కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో టీఎంసీ-2025 కాన్ఫరెన్స్. అక్టోబరు రెండు, మూడు తేదీల్లో సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో జియో టెక్నికల్ ఇన్వెస్టిగేషన్స్‌పై వర్క్‌షాప్. ఏడో తేదీ నుంచి తొమ్మిదో తేదీ వరకు కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో రీసెంట్ అడ్వాన్సెస్ ఇన్ కెమికల్ ఫార్మాస్యూటికల్ అండ్ లైఫ్ సైన్సెస్ అంశంపై జాతీయ వర్క్‌షాప్ నిర్వహణ. 22న ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌పై వర్క్‌షాప్. అక్టోబరు 25 నుంచి 28వ తేదీ వరకు రీజనల్ వాలీబాల్ కోచింగ్ వర్క్‌షాప్‌ను అర్జున, ద్రోణాచార్య అవార్డు గ్రహీత డీఈ శ్రీధరన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. 27 నుంచి 31వ తేదీ వరకు గణిత శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో క్వాంటం కంప్యూటింగ్ కమ్యూనికేషన్స్ ప్రోటోకాల్ అండ్ క్రిప్టోగ్రఫీ అంశంపై వర్క్‌షాప్. క్లస్టర్ విధానంలో భాగంగా ఎలక్ట్రికల్ సైన్స్, మెకానికల్ సైన్స్, నేచురల్ సైన్స్, సోషల్ సైన్స్ లా మేనేజ్‌మెంట్ అంశాల్లో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించాలని నిర్ణయించారు. వీటితోపాటు ఏయూ అనుబంధ కళాశాలలను ఒక సమూహంగా ఏర్పాటుచేసి రూరల్ ఔట్రీచ్ కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.

సెల్లార్ నిబంధనలా.. ఎవరు పట్టించుకుంటారు?



ఊర్వశి జంక్షన్ వద్ద రోడ్డు మీదే పార్కింగ్ చేసిన వాహనాలు



ఊర్వశి జంక్షన్ వద్ద సెల్లార్‌లో దుకాణాలు

కంచరపాలెం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు బేఖాతరు చేస్తూ ఎవరిష్టాను సారం వారు వ్యాపారాలు చేసుకుంటున్నా జీవీఎంసీ యంత్రాంగం కళ్లులేని కబోదిలా వ్యవహరిస్తోంది. పోనీ ట్రాఫిక్ పోలీసు యంత్రాంగమైనా రోడ్డుమీదే వాహనాలు పార్కింగ్ చేయడానికి కారణమేమిటా? అని కించిత్ కూడా పరిశీలించడం లేదు. వీరి నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారింది. కంచరపాలెం మెట్టు నుంచి ఊర్వశి జంక్షన్ వరకు బహుళ అంతస్తుల నిర్మాణాల్లో సెల్లార్లు ఆక్రమణలు, దుకాణాలతో నిండిపోవడంతో వాహనాలు రోడ్డుమీదే పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ఎక్కడచూసినా పార్కింగ్ వాహనాలతో ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. నిబంధనల ప్రకారం బహుళ అంతస్తులు, వాణిజ్య సముదాయాల కింద సెల్లార్లను వాహనాల పార్కింగ్ కోసం తప్పనిసరిగా విడిచిపెట్టాలి.కానీ కంచరపాలెం ఊర్వశి జంక్షన్, మెట్టు ప్రాంతం వద్ద ఇటువంటి నిబంధనలు ఏవీ అమలు కావడం లేదు. అద్దె తీసుకుంటూ .సెల్లార్లలో దుకాణాల ఏర్పాటుకు ఆయా యజమానులు అనుమతించినా, జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు కనీస చర్యలకు కూడా ముందుకు రావడం లేదు. దీనిపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఊర్వశి జంక్షన్ వద్ద అన్నపూర్ణా కాంప్లెక్స్ వాణిజ్య సముదాయంలో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. సెల్లార్‌లోనే సుమారు పది దుకాణాలు నిర్వహిస్తున్నారు.నాలుగు అంతస్తుల ఈ సముదాయంలో సుమారు 30 వరకు దుకాణాలు ఉన్నాయి. దీనికి సెల్లార్ లేకపోవడంతో దుకాణాలకు వచ్చే వాహనదారులంతా రోడ్డుమీదే పార్కింగ్ చేసి ట్రాఫిక్ సమస్యలకు కారణమవుతున్నారు. ఇదే పరిస్థితి కంచరపాలెం మెట్టు వద్ద కూడా కనిపించి గజిబిజిగా ఉండడంతో ప్రజలు, వాహనదారులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇప్పటికైనా టౌన్ ప్లానింగ్, ట్రాఫిక్ సిబ్బంది దృష్టి సారించి సెల్లార్‌లో దుకాణాలు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

మార్కెట్లకు శ్రావణ శుక్రవారపు కళ



కంచరపాలెం రైతుబజార్ వద్ద కొనుగోలుదారుల రద్దీ

కంచరపాలెం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పౌర్ణమికి ముందు వచ్చే శ్రావణ శుక్రవారం రోజున మహిళలు వరలక్ష్మి పూజ చేయనున్న నేపథ్యంలో బుధవారం మార్కెట్లు కొనుగోలుదారులతో కిక్కిరిశాయి. ఈ నెల 8న వరలక్ష్మి వ్రతానికి అవసరమైన వివిధరకాల పుష్పజాతులు, పండ్లు, ఇతర పూజా సామగ్రి కొనుగోలు కోసం మహిళలు మార్కెట్లకు బారులు తీరారు. కంచరపాలెం, మెట్టు వద్ద బజార్లలో అన్ని రకాలు వస్తువులు, తాజా పూలు, పండ్లు లభ్యంకావడంతో ఇతర ప్రాంతాల నుంచి అనేకమంది విచ్చేసి కొనుగోలు చేశారు. కంచరపాలెం రైతుబజార్ వద్ద కొనుగోలుదారులతో ట్రాఫిక్ రద్దీ కనిపించింది. ఒక రోజు ముందు గురువారం ధరలు విపరీతంగా ఉంటాయనే ఆలోచనతో బుధవారం కొనుగోళ్లకు రావడంతో మార్కెట్లు శ్రావణ శుక్రవారపు కళ సంతరించుకున్నాయి.



స్వర్ణోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మంజుల తదితరులు

మహిళలకు ఉన్నత విద్య ఘనత డిగ్రీ కళాశాలదే

» దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

డాబాగార్డెన్స్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ఉన్నత విద్యను అందిస్తున్న ఘనత విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు దక్కుతుందని దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే సీహెచ్.వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. బుధవారం పాతజైల్‌రోడ్డులోని విశాఖ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వర్ణోత్సవాలకు సంబంధించి పోస్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 1975లో కేవలం మూడు కోర్సులు, తక్కువమంది విద్యార్థినులతో ప్రారంభమైన కళాశాల గత 50 ఏళ్లుగా ఎంతో మంది మహిళలకు ఉన్నత విద్య అందించిందన్నారు. ప్రస్తుతం 25 విభిన్న కోర్సులను అందిస్తూ రెండువేల మంది విద్యార్థినుల విద్యావసరాలను తీరుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.విజయ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిర్మూలన అందరి లక్ష్యం కావాలి

» దక్షిణ కోస్తా రైల్వే జీఎం సందీప్ మాథుర్ సూచన



ఈస్ట్‌పాయింట్ కాలనీని శుభ్రం చేస్తున్న జీఎం సందీప్ మాథుర్, సౌత్ కోస్ట్ రైల్వే ఓఎస్‌డీ చంద్రశేఖర్

విశాఖపట్నం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రైల్వే మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు బుధవారం స్వచ్ఛ భారత్ అభియాన్ ప్రచార కార్యక్రమంలో సౌత్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ సందీప్ మాథుర్ పాల్గొన్నారు. ఈస్ట్ పాయింట్ కాలనీలో నిర్వహించిన స్వచ్ఛ భారత్ అభియాన్‌లో ఆయన పాల్గొని ప్రాంగణంలోని ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తా చెదారం తొలగించి నిబద్ధత చాటుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని నిర్మూలించడం, శాస్త్రీయపద్ధతిలో వ్యర్థాలను తొలగించడం ద్వారా పరిశుభ్రమైన వాతావరణం, ఆరోగ్యాన్ని పొందడంపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరముందన్నారు. పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా నిర్వహించడంలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రైల్వే మంత్రిత్వ ఆదేశాల మేరకు 15 రోజులపాటు భారతీయ రైల్వేలోని అన్ని ప్రాంగణాలలో స్వచ్ఛభారత్ అభియాన్ చేపడుతున్నామని పేర్కొన్నారు. అనంతరం పరిశుభ్రత ప్రమాణాలను కాపాడుకోవడంలో భాగంగా స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగస్వామ్యం కావాలని సౌత్ కోస్ట్ రైల్వే ఓఎస్‌డీ చంద్రశేఖర్‌తోపాటు అధికారులు, రైల్వే రక్షణ దళం, స్వచ్ఛ సేవలతో ప్రతిజ్ఞ చేయించారు. గత కొంత కాలంగా వాల్తేరు రైల్వే పరిధిలోని అన్ని స్టేషన్లు, కార్యాలయాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తూ ప్రచార కార్యక్రమాలు చేపడుతున్నారు. డీఆర్ఎం లలిత్ బొహ్రా, సీనియర్ డీసీఎం సందీప్, ఇతర ఉన్నతాధికారులు, ఉద్యోగులు, సిబ్బంది కలసి స్వచ్ఛభారత్ కార్యక్రమాల్లో పాల్గొన్న సంగతి తెలిసిందే.

మంచి ప్రాజెక్టు నమూనాలు తయారు చేయండి: కలెక్టర్



'ఇన్‌స్పైర్ మనక్ సైన్స్ ఫెయిర్' పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

మహారాణిపేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఆరో తరగతి నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు 'ఇన్‌స్పైర్ మనక్ సైన్స్ ఫెయిర్‌'లో పాల్గొని మంచి ప్రాజెక్టు నమూనాలు తయారు చేయాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో సైన్స్ ఫెయిర్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారి ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లా నుంచి అత్యధిక నామినేషన్లు ఉండేలా ఉపాధ్యాయులు, విద్యార్థులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు జె.చంద్రశేఖర్, పి.రాజారావు, టీవీఎస్ చంద్రాజీరావు, సూర్యనారాయణ, జానకీరామ్, దేవుడుబాబు పాల్గొన్నారు.

రోలర్ స్కేటింగ్‌లో జెస్సీకి పతకం



జెస్సీని అభినందిస్తున్న రాష్ట్ర క్రీడల మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

విశాఖపట్నం స్పోర్ట్సు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఆసియా రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ టోర్నీలో ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ గ్రహీత జెస్సీ రాజ్ మాత్రపు అద్భుతమైన ప్రతిభ కనబరిచి పతకం సాధించింది. దక్షిణా కొరియాలో జరిగిన ఈ టోర్నీ బాలికల సబ్ జూనియర్ సోలో డ్యాన్స్ ఈవెంట్‌లో ప్రతిభను ప్రదర్శించింది. ఈ సందర్భంగా రాష్ట్ర క్రీడల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి బుధవారం తన కార్యాలయంలో జెస్సీని అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని పతకాలు దేశానికి అందించి రాష్ట్ర క్రీడా రంగ ప్రతిష్టను ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు. అలాగే జెస్సీని అంతర్జాతీయ స్కేటర్‌గా తీర్చిదిద్ది, ప్రతిష్ఠాత్మక టోర్నీలలో పతకాలు సాధించే దిశగా శిక్షణ ఇస్తున్న కోచ్ సింహాద్రి, ఆదేశ్ సింగ్‌లను కూడా మంత్రి అభినందించారు.

కాపుల అభ్యున్నతికి నిధులు కేటాయించాలి

» సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆరేటి ప్రకాష్



సమావేశంలో మాట్లాడుతున్న కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆరేటి ప్రకాష్

సీతంపేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో 18 శాతం జనాభా ఉన్న కాపుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం రూ.10 వేల కోట్లు కేటాయించాలని కాపు అభివృద్ధి, సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆరేటి ప్రకాష్ సూచించారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటుకు కాపులంతా ఐక్యంగా పని చేశారని గుర్తుచేశారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ పిలుపుతో సామాజికవర్గం అంతా ఒక్కతాటిపైకి వచ్చి పని చేశారన్నారు. కాపులను అన్ని విధాలా ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని సూచించారు. ఈడబ్ల్యూఎస్‌లో 5 శాతం రిజర్వేషన్‌ను పక్కాగా అమలు చేయాలని గతంలో చంద్రబాబు జారీ చేసిన ఉత్తర్వును గుర్తుచేశారు. పి-4 పథకంలో కాపుల సంక్షేమానికి పాటు పడాలన్నారు. జనగణన, కులగణనలో కాపుల వాస్తవ పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని సహాయ సహకారాలు అందించాలన్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి బి.ఎన్.మూర్తి మాట్లాడుతూ శ్రీకృష్ణ దేవరాయలు జయంతి, వర్ధంతులను రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలుగా చేపట్టాలన్నారు. కాపులు ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగేలా సహకారం అందించాలని ప్రభుత్వానికి లేఖ రాశామన్నారు. ఈ కార్యక్రమంలో కాపు నాయకులు కేవీవీఎస్ సత్యనారాయణ, గొల్లకోట సుబ్బారావు, బి.రామోజోగి పాల్గొన్నారు.

నిత్యాన్న పథకానికి విరాళం

సింహాచలం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): అప్పన్న దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి హైదరాబాద్‌కు చెందిన కె. సుబ్బారెడ్డి రూ. లక్ష విరాళంగా సమర్పించారు.విరాళాన్ని చెక్ రూపంలో దేవాలయ ప్రజా సంబంధాల పర్యవేక్షణాధికారి వెంకటేశ్వరరావుకు బుధవారం ఆయన అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం దాతకు స్వామివారి దర్శనం కల్పించి, శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు.

హోటళ్లు, బేకరీలపై కేసులు

... 5వ పేజీ తరువాయి

నిర్వహించాయన్నారు. తొలిరోజు హోటళ్లలో నిల్వ ఉన్న 125 కిలోల ఆహారాన్ని గుర్తించి నాశనం చేశామని, నిబంధనలు ఉల్లఘించిన వారిపై కేసులు నమోదు చేశామన్నారు. అలాగే రెండో రోజు బేకరీలు, స్వీట్స్ దుకాణాల్లో సోదాలు చేసి నిల్వ ఉన్న, గడువు తీరిన 50 కిలోల ఆహార పదార్థాలను నాశనం చేసినట్టు తెలిపారు. 16 కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. మొత్తమ్మీద 39 నమూనాలు సేకరించి హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపించామని, రిపోర్టులను బట్టి ఆయా హోటల్స్, రెస్టారెంట్లు, షాపులపై చర్యలు తీసుకుంటామన్నారు. కలర్స్ వినియోగించిన ఆహార పదార్థాల వినియోగానికి ప్రజలు దూరంగా ఉండాలన్నారు. తూనికలు, కొలతల శాఖ డిప్యూటీ కంట్రోలర్ థామస్ రవికుమార్ మాట్లాడుతూ 24 చోట్ల తూకాలను ముద్రణ లేకుండా వినియోగిస్తున్నట్టు గుర్తించి కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. ప్యాకేజీ నిబంధనలు ఉల్లంఘించడంతో మరో 18 కేసులు నమోదు చేసినట్టు వెల్లడించారు. రెండు రోజుల్లో మొత్తం 58 కేసులు నమోదుచేశామన్నారు. సమావేశంలో ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లు పి.శ్రీను, ఎస్.ఆనందరావు పాల్గొన్నారు.

అల్లూరి పోరాటస్ఫూర్తిని సజీవంగా ఉంచాలి

» ఏఐడీఎస్‌వో ప్రతినిధుల డిమాండ్



ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఆందోళన చేస్తున్న ఏఐడీఎస్‌వో ప్రతినిధులు

డాబాగార్డెన్స్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): అల్లూరి పోరాట స్ఫూర్తిని సజీవంగా ఉంచాలని ఆలిండియా డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ నాయకులు డిమాండ్ చేశారు. అల్లూరి సీతారామరాజు పోరాట స్ఫూర్తికి సాక్ష్యాలుగా నిలిచిన అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలోని బ్రిటిష్ సైనికాధికారుల సమాధుల స్థలం ఆక్రమణను అడ్డుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం విశాఖపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఏఐడీఎస్‌వో నగర కమిటీ ఆందోళన చేపట్టింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భవిష్యత్తు తరాల కోసం స్వాతంత్ర్య సమరయోధుల పోరాటాన్ని, వారి స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. నర్సీపట్నంలో ఉన్న బ్రిటిష్ సైన్యాధికారులు స్కాట్‌కోవర్ట్, హైటర్ సమాధులు చారిత్రక కట్టడాలు మాత్రమే కాదన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో అల్లూరి, ఆయన అనుచరుల వీరోచిత పోరాటాలకు అవి సజీవ సాక్ష్యాలన్నారు. అటువంటి ప్రాధాన్యత ఉన్న స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడం దారుణమన్నారు. ఈ చారిత్రక సమాధుల స్థలం ఆక్రమణలను వెంటనే అడ్డుకోవాలన్నారు. ఈ స్థలాన్ని పురావస్తుశాఖకు అప్పగించి సంరక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐడీఎస్ఓ జిల్లా అధ్యక్షుడు కె.అభిలాష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రైవేటు హాస్టళ్లలో భద్రత ప్రశ్నార్థకం

... 5వ పేజీ తరువాయి

అనుబంధంగా హాస్టళ్లు వెలిశాయి. జూనియర్ కళాశాలల పరిధిలో హాస్టళ్ల నిర్వహణకు ఇంటర్ బోర్డు అనుమతి ఇవ్వడం లేదు. అయినప్పటికీ కొంతమంది స్థానిక సంస్థల నుంచి తూతూమంత్రంగా సర్టిఫికెట్ తెచుకుని హాస్టళ్లు ఏర్పాటుచేస్తున్నారు. మరికొందరు ఈ సర్టిఫికెట్లు లేకుండానే హాస్టళ్లు నడుపుతున్నారు. అగ్నిమాపక, విద్యుత్ సంస్థల నుంచి కూడా అనుమతులు పొందడం లేదు.

ఇష్టారాజ్యంగా నిర్వహణ

ఉత్తరాంధ్ర జిల్లాలతోపాటు పొరుగు రాష్ట్రాల విద్యార్థులు వస్తుండడంతో నగరంలో ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలు పెరిగాయి. వాటిలో చాలావరకూ హాస్టళ్లు నడుపుతున్నాయి. కొద్ది సంస్థలు మినహా మిగిలిన యజమాన్యాలు గాలికి వదిలేశాయి. వాటిపై దృష్టి సారించాల్సిన ఇంటర్ బోర్డు అధికారులు తూతూమంత్రంగా తనిఖీలతో సరిపెట్టేస్తున్నారు. ఇంటర్ బోర్డులో ఆర్ఐవో, సూపరింటెండెంట్, ఇద్దరు ముగ్గురు ఉద్యోగులు మాత్రమే ఉన్నారు. వారికి నగరంలోని అన్ని కళాశాలలు, హాస్టళ్లు తనిఖీ చేయడం సాధ్యంకాదు. ఈ నేపథ్యంలో కమిటీలను నియమించి తనిఖీల బాధ్యతను అప్పగిస్తుంటారు. ఈ కమిటీల్లో ఉన్న అధ్యాపకులను ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు ప్రలోభాలకు గురిచేస్తుంటాయి. దీంతో అన్నీ సక్రమంగానే ఉన్నాయని సర్టిఫికెట్ జారీ చేసేస్తున్నారు. గత ఏడాది వాల్తేర్‌లోని ఓ కళాశాల హాస్టల్‌లో ఆహారం కలుషితమై పలువురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. దీంతో నగరంలోని హాస్టళ్ల పనితీరుపై నివేదిక కోరుతూ కలెక్టర్ కమిటీలు వేశారు. అయితే ఆ కమిటీలు ప్రైవేటు జూనియర్ కళాశాలల పరిధిలోని హాస్టళ్ల పనితీరు భేషుగ్గా ఉందని తేల్చాయి. పరిశుభ్రత విషయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని మాత్రమే సూచించాయి. ఈ కమిటీలోని అధ్యాపకులకు భారీగా ముడుపులు అందడంతోనే ఇలాంటి నివేదికలు ఇచ్చారనే ఆరోపణలు వినిపించాయి. ఇటీవల ఓ కార్పొరేట్ కళాశాల హాస్టల్‌లో అగ్ని ప్రమాదం సంభవించిన నేపథ్యంలో ఇంటర్‌బోర్డు అధికారులు భద్రత, అనుమతులు, నిర్వహణపై పూర్తిస్థాయి తనిఖీలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

కోటనరవ పార్కు స్థలంపై యథాతథ స్థితి

... 5వ పేజీ తరువాయి

చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. విశాఖపట్నం జిల్లా, కోటనరవ గ్రామం పరిధిలో సర్వే నంబర్ 10/9బీ ఈడబ్ల్యూఎస్ కాలనీలో 180 గజాల పార్కు స్థలాన్ని ప్రైవేటు వ్యక్తి మల్ల రమణకు ఇచ్చి, వారి స్థలాన్ని జీవీఎంసీ తీసుకొనేందుకు అనుమతిస్తూ ఈ ఏడాది మార్చి 5న పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ను సవాల్ చేస్తూ జనసేన కార్పొరేటర్ పీవీఎల్ఎన్ మూర్తి యాదవ్ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు రాగా...పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది కేఎస్ మూర్తి యాదవ్ వాదనలు వినిపించారు. పార్కు స్థలాన్ని ఇతర అవసరాల కోసం వినియోగించడానికి వీల్లేదన్నారు. పార్కు స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులతో పరస్పర మార్పిడి చేసుకొనేందుకు...కౌన్సిల్ సమావేశంలో ఉంచి ఆమోదం పొందాల్సి ఉంటుందన్నారు. కౌన్సిల్ ఆమోదం లేకుండానే పురపాలకశాఖ ఏకపక్షంగా ప్రొసీడింగ్స్ ఇచ్చిందన్నారు. అనధికార ప్రతివాది తరఫున న్యాయవాది పదిరి రవితేజ వాదనలు వినిపించారు. ఇప్పటికే ఉన్న రోడ్డును వెడల్పు చేసేందుకు వీలుగా పరస్పర స్థల మార్పిడి నిమిత్తం జీవీఎంసీకి దరఖాస్తు చేశామన్నారు. ఈ వ్యవహారంపై కౌన్సిల్ నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు.

పరీక్షల నిర్వహణలో వినూత్న ప్రయోగం

... 5వ పేజీ తరువాయి

మూలనపడేస్తుంటారు. దీంతో అవసరమైన సందర్భంలో విద్యార్థి ప్రతిభ, సామర్థ్యం తెలుసుకునే వీలుండడం లేదు. ఈ నేపథ్యంలో ఉచితంగా అందజేసే అసెస్‌మెంట్ బుక్‌లెట్ విద్యార్థి ప్రతిభకు ప్రామాణికంగా నిలుస్తుందని ప్రభుత్వం భావించింది. ప్రతి సబ్జెక్టుకు అసెస్‌మెంట్ బుక్‌లెట్‌ను సరఫరా చేస్తోంది. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు సుమారు 75 వేల మంది చదువుతున్నారు. ఒకటి, రెండు తరగతులకు మూడు సబ్జెక్టులు, 3,4,5 తరగతులకు నాలుగు, ఆరు, ఏడు తరగతులకు ఆరు, ఎనిమిది నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు ఏడు సబ్జెక్టులు బోధిస్తున్నారు. ఈ మేరకు ఉచితంగా అసెస్‌మెంట్ పుస్తకాలు అందజేస్తారు. పరీక్ష ముగిసిన తరువాత సబ్జెక్టు టీచరు దానిని మూల్యాంకనం చేస్తారు. అసెస్‌మెంట్ పుస్తకాలు సబ్జెక్టు టీచర్ల వద్దనే ఉంటాయి. పరీక్షల ఆధారంగా విద్యార్థుల సామర్థ్యం అంచనా వేసేందుకు ఇవి దోహదపడతాయని జిల్లా పరీక్షల బోర్డు కార్యదర్శి ఎంవీ కృష్ణకుమార్ అభిప్రాయపడ్డారు. ఇప్పటివరకు ఇండెంట్‌లో 60 శాతం సరఫరా చేశారని, మిగిలినవి ఒకటి, రెండు రోజుల్లో వస్తాయన్నారు.

స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో కూటమికి 9, వైసీపీకి 1

... 5వ పేజీ తరువాయి

జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్; సీపీఎం కార్పొరేటర్ బి.గంగారావు, ఆరో వార్డు కార్పొరేటర్ ముత్తంశెట్టి ప్రియాంక, 91వ వార్డు కార్పొరేటర్ కంచెజ్యోత్స్న, 92వ వార్డు కార్పొరేటర్ బెహరా వెంకట స్వర్ణలత ఓటింగ్‌కు హాజరుకాలేదు. 92 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. వీరిలో వైసీపీకి 32 మంది కార్పొరేటర్లు మద్దతు ఉండగా, మిగిలిన 60 మంది టీడీపీ, జనసేన, బీజేపీకి చెందినవారు ఉన్నారు. మధ్యాహ్నం మూడు గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభించారు. రౌండ్‌కు 24 ఓట్లు చొప్పున నాలుగు రౌండ్లలో లెక్కింపు జరిగింది. నాలుగురౌండ్‌ల లెక్కింపు పూర్తయ్యేసరికి కూటమి మద్దతుతో పోటీ చేసిన కొణతాల నీలిమకు 58, గంకల కవితకు 57, దాడి వెంకటరామేశ్వరరావుకు 57, మొల్లి హేమలతకు 57, సేనాపతి వసంతకు 54, గేదెల లావణ్యకు 53, మాదంశెట్టి చినతల్లికి 52, రాపర్తి త్రివేణీవరప్రసాదరావుకి 52, మొల్లి ముత్యాలకు 51 ఓట్లు రాగా వైసీపీకి చెందిన సాడి పద్మారెడ్డికి 50 ఓట్లు లభ్యమవడంతో వారంతా గెలుపొందినట్టు అధికారులు తేల్చారు. కూటమి మద్దతుతో పోటీకి దిగిన టీడీపీకి చెందిన 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావుకు 49 ఓట్లు రావడంతో రీకౌంటింగ్‌కు కూటమి నేతలు పట్టుబట్టారు. దీంతో అధికారులు మరోసారి ఓట్ల లెక్కించగా అదే ఫలితం వచ్చింది. ఆ సమయంలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు కేకేరాజు, వైసీపీ ఫ్లోర్‌లీడర్ బాణాల శ్రీనివాసరావు, మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ తదితరులు కమిషనర్ కేతన్‌గార్గ్‌ను కలిసి తమ అభ్యర్థికి 50 ఓట్లు వచ్చినా గెలుపును ప్రకటించడంలో జాప్యంచేస్తున్నారని, తక్షణం జోక్యంచేసుకోవాలని కోరారు. దీంతో కమిషనర్ ఓట్ల లెక్కింపు జరుగుతున్న హాల్‌కు వెళ్లి నాలుగు రౌండ్ల ఓట్లను పరిశీలించారు. అనంతరం అత్యధికంగా ఓట్లు సాధించిన పది మందిని గెలుపొందినట్టు ప్రకటించారు.

క్రాస్ ఓటింగ్!

... 5వ పేజీ తరువాయి

తీవ్రస్థాయికి పెరిగిపోయింది. ప్రధానంగా జనసేనకు చెందిన కొందరు కార్పొరేటర్లు కూటమి ఎమ్మెల్యేలు, పాలకవర్గంలోని పెద్దల తీరుపై ఆగ్రహంతో ఉన్నారు. జనసేనకు చెందిన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్‌కు, ఆ పార్టీకి చెందిన ఒక ఎమ్మెల్యేకు ప్రత్యక్షంగానే వార్ నడుస్తోంది. ఇద్దరూ ఒకరిపై ఒకరు అధిష్ఠానానికి ఫిర్యాదు చేసుకుంటున్నారు. కూటమి నేతలుగానీ, పాలకవర్గం పెద్దలుగానీ తనకు కనీసం సహాయం అందించడం లేదని మూర్తియాదవ్ అసంతృప్తితో ఉన్నారు. జనసేన స్థానిక నాయకత్వం తీరుకు నిరసనగా స్టాండింగ్ కమిటీ ఎన్నికను బహిష్కరిస్తున్నట్టు ఆయన ప్రకటించారు. మరోవైపు బెహరా భాస్కరరావు మేయర్ ఉప ఎన్నికకు ముందు వైసీపీ నుంచి జనసేనలో చేరారు. ఆ సమయంలో తనకు ఇచ్చిన హామీలను కూటమి నేతలు నెరవేర్చలేదని, స్థానిక టీడీపీ నేత నుంచి తనకు అవమానాలు ఎదురవుతున్నాయంటూ బహిరంగంగానే నేతల వద్ద అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. బుధవారం జరిగిన స్టాండింగ్ కమిటీ ఎన్నికకు ఆయన కుటుంబంలోని ఇద్దరు కార్పొరేటర్లు గైర్హాజరవ్వడానికి కారణం అదేనని కూటమి నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. ఇండిపెండెంట్‌గా గెలిచి జనసేనలో చేరిన ఒక కార్పొరేటర్ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులకు ఓటు వేయాలని కోరుతూ మెసేజ్‌లు పెట్టినట్టు టీడీపీ కార్పొరేటర్లు చెబుతున్నారు. మరోవైపు వైసీపీ నుంచి జనసేన, టీడీపీల్లో చేరిన కార్పొరేటర్లు ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల వ్యవహారశైలిపై అసంతృప్తితో ఉన్నారు. తాము పార్టీ మారినప్పటికీ ఇప్పటికీ వైసీపీ కార్పొరేటర్లుగానే భావిస్తున్నారని, తమ చేతిలో ఓటమి పాలైన వారిని వార్డుల్లో కార్యక్రమాలకు పిలిచి తమను అవమానపరుస్తారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వారిలో కొందరు వైసీపీకి అనుకూలంగా ఓటేసి ఉంటారని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. టీడీపీకి చెందిన కొందరు కార్పొరేటర్లు సైతం ప్రస్తుతం పాలకవర్గంలోని నేతల తీరుపై గుర్రుగా ఉన్నారని, వారు కూడా స్టాండింగ్ కమిటీ ఎన్నికలో క్రాస్ ఓటింగ్‌కు పాల్పడ్డారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కూటమి ఎమ్మెల్యేలు కూడా తమ నియోజకవర్గాల పరిధిలోని కొందరు కార్పొరేటర్ల తీరుపై ఆగ్రహంతో ఉన్నారు. అందుకే స్టాండింగ్ కమిటీ ఎన్నికల గురించి పట్టించుకోలేదని, అది కూడా పోలింగ్‌పై ప్రభావం చూపి, అభ్యర్థి ఓటమికి కారణంగా మారిందని అంటున్నారు.



క్రీడాకారులు, తదితరులతో పల్లా శ్రీనివాసరావు

టెన్నిస్ క్రీడాకారులకు 'పల్లా' అభినందనలు

గాజువాక, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): అమెరికాలో ఉన్నత విద్యతో పాటు టెన్నిస్‌లో విశేష ప్రతిభ చూపుతున్న గాజువాక ప్రాంతానికి చెందిన కోగంటి రాజిత, కోగంటి సంహితలను టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు బుధవారం గాజువాకలోని టీడీపీ కార్యాలయంలో అభినందించారు. రాజిత వెస్ట్ వర్జీనియాలోని బ్లూఫీల్డ్ యూనివర్సిటీలో టెన్నిస్‌లో సీటు సాధించి ప్రస్తుతం ఆ క్రీడలో రాణిస్తుంది. అలాగే సంహిత ఫిట్స్‌బర్గ్ యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియాలో టెన్నిస్ సీటు సాధించింది. టెన్నిస్‌లో విశేష ప్రతిభ చూపి దేశానికి, గాజువాకకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని పల్లా ఆకాంక్షించారు.

డిప్యూటీ మేయర్-2పై అవిశ్వాస తీర్మానం

» లేఖపై 49 మంది కూటమి కార్పొరేటర్ల సంతకాలు

విశాఖపట్నం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ డిప్యూటీ మేయర్-2 కట్టమూరి సతీష్‌పై అవిశ్వాస తీర్మానం నోటీసు ఇవ్వాలని కూటమి నేతలు నిర్ణయించారు. సతీష్ ఎన్నికై గతనెల 31వ తేదీ నాటికి నాలుగేళ్లు పూర్తయింది. దీంతో అవిశ్వాసం పెట్టడానికి చట్ట ప్రకారం వీలుంది. ఈ మేరకు సిద్ధం చేసిన లేఖపై బుధవారం 49 మంది కార్పొరేటర్లు సంతకాలు చేశారు. మరో ఐదుగురు సంతకం చేయాల్సి ఉండగా, స్టాండింగ్ కమిటీ ఎన్నిక కారణంగా దీనిపై దృష్టిసారించడానికి అవకాశం లేకుండా పోయింది. వారంతా సంతకాలు చేశాక కలెక్టర్‌కు లేఖ అందజేయనున్నారు.

ఆర్‌వోబీ పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని వినతి

అక్కిరెడ్డిపాలెం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తుంగ్లాం వద్ద చేపట్టిన రోడ్ ఓవర్ బ్రిడ్జి (ఆర్‌వోబీ) పనులు త్వరిగంగా పూర్తయ్యేలా చేసి స్థానికులను ఆదుకోవాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి విజ్ఞప్తి చేశారు.

ఈ మేరకు గాజువాకలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం పల్లాను కలిసి బ్రిడ్జి నిర్మాణ పనుల్లో జరుగుతున్న జాప్యం వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను వివరించి, వినతి పత్రం అందజేశారు. ఆర్‌వోబీ నిర్మాణం పూర్తి కాకపోవడంతో ఆటోనగర్‌లో పనిచేస్తున్న కార్మికులతో పాటు స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఈ బ్రిడ్జి నిర్మాణం కోసం భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేయడంతో పాటు బ్రిడ్జి వద్ద కాపు తుంగ్లాం, చుక్కవానిపాలెం కాలనీల ప్రధాన రోడ్డుకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని పల్లాను కోరారు.

సినిమా గైడ్

- **సార్, మేడమ్** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **కింగ్డమ్** : జగదాంబ
- **సన్ ఆఫ్ సర్దార్** : రమాదేవి
- **మహావతార్ నరసింహ** : సంగం, కిన్నెర, వెంకటేశ్వర-1, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)
- **హరిహర వీరమల్లు** : శారద, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శ్రీరామా, కామేశ్వరి, శ్రీకన్య, శ్రీకాంతి, సౌజన్య, సుకన్య (గోపాలపట్నం), మౌర్య, నటరాజ్ (పెందుర్తి). మోహిని, మినీ మోహిని (గాజువాక), శ్రీకన్య, కన్య, హెవెన్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 48, వంకాయలు (తెలుపు) 26, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 38, పచ్చిమిర్చి 60, కాకరకాయలు 32, బీరకాయలు 42, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 34, క్యాబేజీ 16, క్యారెట్ 46, దొండకాయలు 40, బంగాళదుంపలు 18, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 40, అల్లం (పాతది) 74, బరబాటి 32, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 55, బద్దచిక్కుడు 50, దోసకాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 84, కీరదోస 32, క్యాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 36, చిలగడదుంపలు 48, కంద 42, గోరుచిక్కుడు 38, దేముడుచిక్కుడు 102, కూరపెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)
(వంద - రూ.లలో)

విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

చికెన్ ధరలు
బ్యాగ్

రైతు ధర	85
లైవ్ ధర	105
విత్ స్కిన్	180
స్కిన్‌లెస్	190



88వ వార్డు పరిధి సంధ్యానగర్‌లో గ్రావెల్ తవ్వకాలు జరిపిన ప్రాంతం



తవ్విన గ్రావెల్‌ను కుప్పలుగా వేసిన దృశ్యం

ఇష్టారాజ్యంగా గ్రావెల్ తవ్వకాలు

అధికారులు పట్టించుకోవడం లేదని వెల్లువెత్తుతున్న ఆరోపణలు

కూర్మన్నపాలెం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రాత్రి వేళల్లో ఇష్టారాజ్యంగా గ్రావెల్ తవ్వి పలుచోట్ల నిల్వ చేసి పగటి పూట అక్రమార్కులు యథేచ్ఛగా తరలిస్తున్నా పట్టించుకునే నాథులే కరువయ్యారు. 88వ వార్డు పరిధిలోని మంగళపాలెం, సంధ్యానగర్ జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ కొండకు సమీపంలో గ్రావెల్‌ను రాత్రిపూట తవ్వి కాపుజగ్గరాజుపేట, తదితర ప్రాంతాలతో పాటు 86వ వార్డు పరిధి వుడా నగర్, పకీరుతఖ్యా, తదితర ప్రాంతాల్లో అక్రమార్కులు నిల్వ చేస్తున్నారు. అలా తవ్విన గ్రావెల్‌ను పగటి పూట లారీల్లో ఇతర ప్రాంతాలకు తరలిస్తూ లక్షలాది రూపాయలను ఆర్జిస్తున్నారు. ఒకవేళ ఎవరైనా అడ్డుకున్నా వారితో అక్రమార్కులు వాగ్వాదానికి దిగుతున్నారు. గ్రావెల్ తవ్వకాలపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే అధికారులు తూతూ మంత్రంగానే చర్యలు చేపడుతుండడంతో అక్రమార్కుల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతుందని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రశ్నించే నాథులే లేకపోవడంతో గ్రావెల్‌ను తవ్వడం.. లారీల్లో తరలించడం అక్రమార్కులకు నిత్యకృత్యంగా మారిందని, స్థానిక నాయకుల కనుసన్నల్లోనే గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు గుసగుసలాడుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రావెల్ తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

క్రీడాకారులంతా అంకితభావంతో సాధన చేయాలి | టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు

పెదగంట్యాడ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులందరూ క్రమశిక్షణ, అంకితభావం, పట్టుదలతో సాధన చేయడం ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. క్రీడాకారుల ప్రయోజనాలను కాపాడడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. 65వ వార్డు పరిధి వికాస్‌నగర్ రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో ఏపీ బ్యాడ్మింటన్ అసోసియేషన్, శాప్ నిర్వహించిన అండర్-19 షటిల్ బ్యాడ్మింటన్ బాలబాలికల పోటీలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒలింపిక్స్‌లో బంగారు పతకం సాధిస్తే రూ.ఎనిమిది కోట్లతో పాటు ఉన్నత స్థాయి ఉద్యోగం కల్పిస్తామని సీఎం చంద్రబాబు నాయుడు ప్రకటించిన విషయాన్ని క్రీడాకారులు గుర్తించుకోవాలన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా క్రీడాకారులు రాణించాలన్నారు. రాష్ట్ర షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.ద్వారకానాథ్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ అంకమ్మచౌదరి మాట్లాడుతూ క్రీడల్లో రాణించే వారికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. అలాగే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అధికంగా ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సీఈవో చుక్క శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి టోర్నమెంట్ ఆర్గనైజర్ పల్లా శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు, టీడీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, కార్పొరేటర్లు బొడ్డు నరసింహపాత్రుడు, రాజాన రామారావు, తదితరులు పాల్గొన్నారు.

చెత్త వేస్తే రూ.వెయ్యి జరిమానా

» కణితి కాళింగుల వీధిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన శానిటరీ ఇన్‌స్పెక్టర్

కూర్మన్నపాలెం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పరిసరాల శుభ్రత మీ బాధ్యత, తడి, పొడి చెత్తను వేరు చేసి మీ ఇళ్ల వద్దకు వచ్చే పారిశుధ్య సిబ్బందికి అందించండంటూ జీవీఎంసీ అధికారులు ప్రచారం చేస్తున్నా 87వ వార్డు కణితి కాళింగుల వీధికి చెందిన పలువురు ఇష్టానుసారంగా చెత్తాచెదారాన్ని ఎక్కడపడితే అక్క పడేస్తున్నారు. దీనిపై ఎన్నిమార్లు ప్రజలకు అవగాహన కల్పించినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో శానిటరీ ఇన్‌సెక్టర్ అప్పారావు ఆధ్వర్యంలో బుధవారం పారిశుధ్య సిబ్బంది ప్రజలు చెత్తాచెదారాలను పడవేసే చోటను శుభ్రంగా తీర్చిదిద్ది అక్కడ అందంగా రంగుముగ్గులు వేశారు. అంతేకాక ఇకపై ఎవరైనా ఇక్కడ చెత్త వేస్తే రూ.వెయ్యి రూపాయల జరిమానా విధిస్తామంటూ హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు.





ప్రజలు చెత్తాచెదారం వేసే ప్రదేశాన్ని శుభ్రంగా తీర్చిదిద్ది రంగు ముగ్గులు వేస్తున్న పారిశుధ్య సిబ్బంది. (ఇన్‌సెట్లో) జరిమానా విధిస్తామని ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు



గల్లా శ్రీను



ఆర్ఎస్. నాయుడు

మార్కెట్ కమిటీ డైరెక్టర్ల నియామకం

పెందుర్తి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పెందుర్తి నియోజకవర్గ మార్కెట్ కమిటీ డైరెక్టర్లుగా మండలం నుంచి గల్లా శ్రీను, ఆర్ఎస్ నాయుడును నియమించారు. ప్రజారాజ్యం పార్టీ స్థాపించినప్పటి నుంచి పంచకర్లకు అనుచరుడిగా ఆర్ఎస్ నాయుడు గుర్తింపు పొందారు. నరవకు చెందిన గల్లా శ్రీను జనసేనలో క్రియాశీలక నేతగా గుర్తింపు పొందారు. ఈ సదర్భంగా మార్కెట్ కమిటీ డైరెక్టర్లుగా నియమించినందుకు ఇరువురు ఎమ్మెల్యే పంచకర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రంథాలయానికి వాటర్ ప్యూరిఫైయర్ వితరణ

పెందుర్తి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శాఖ గ్రంథాలయానికి వ్యాపారవేత్త శరగడం బుజ్జి వాటర్ ప్యూరిఫైయర్ బుధవారం వితరణ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో నిర్వహించిన సమావేశంలో బుజ్జి ఆ ప్యూరిఫైయర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి చంద్రకళ, అభివృద్ధి కమిటీ కార్యదర్శులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి'

పెదగంట్యాడ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించాలని తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి మొల్లి పెంటిరాజు టీడీపీ కార్యకర్తలను కోరారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని బుధవారం నెల్లిముక్కు నాయీబ్రాహ్మణ కాలనీ, విశ్వబ్రాహ్మణ వీధిలో టీడీపీ శ్రేణులు నిర్వహించారు. ఈ సందర్భంగా పెంటి రాజు మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ఏడాది కూటమి పాలనలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ 75వ వార్డు ప్రధాన కార్యదర్శి ములకలపల్లి పెంటయ్య, క్లస్టర్ ఇన్‌చార్జి ఉరుకూటి అప్పలరాజు, నాయకులు నమ్మి అప్పారావు, ఉరుకూటి అప్పారావు, అండిబోయిన రామునాయుడు, వంగలపూడి అప్పలరాజు, కణితి సన్యాసమ్మ, పెద్దాడ సరోజని, తదితరులు పాల్గొన్నారు.

ప్రీపెయిడ్ ఆటో ట్యాక్సీల సేవలు ప్రారంభం



ప్రీపెయిడ్ ఆటో ట్యాక్సీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీపీ

గోపాలపట్నం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రైల్వే స్టేషన్ నుంచి రేయింబవళ్లు తమ గమ్యాలకు వెళ్లే ప్రయాణికులను క్షేమంగా చేర్చడానికి ప్రీపెయిడ్ ఆటో ట్యాక్సీ సేవలు ఎంతో సురక్షితమని సీపీ శంఖబ్రత బాగ్చీ అన్నారు. సింహాచలం రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ప్రీపెయిడ్ ఆటో ట్యాక్సీ కేంద్రాన్ని డీఆర్ఎం లలిత్ బొహ్రాతో కలిసి సీపీ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీపీఎస్ అమర్చిన ఈ ఆటో ట్యాక్సీల్లో ప్రయాణించడం వల్ల ఎటువంటి ఇబ్బంది లేకుండా భద్రతతో కూడిన ప్రయాణం చేయవచ్చని అన్నారు. నిరంతరం పోలీసుల పర్యవేక్షణలో ఉండే ఈ ప్రీపెయిడ్ ఆటో ట్యాక్సీల సేవలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డీఆర్ఎం లలిత్ బొహ్రా మాట్లాడుతూ రైల్వే స్టేషన్‌లలో ప్రయాణికులకు మెరుగైన వసతులు, సురక్షితమైన సేవలు కల్పించడానికి రైల్వే శాఖ నిరంతరం కృషి చేస్తోందని అన్నారు. అమృత్ భారత్‌లో ఎంపికైన సింహాచలం రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు అన్ని సౌకర్యాలు కల్పించనున్నట్టు తెలిపారు. ప్రీపెయిడ్ ఆటో ట్యాక్సీ కేబిన్‌ను విరాళంగా అందించిన ఆలివ్ సతీశ్‌ను, ఇతన సౌకర్యాలు కల్పించిన సోనోవిజన్ మేనేజర్ గోపాల్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ డి.మేరీ ప్రశాంతి, ఏడీసీపీ(ట్రాఫిక్) కె.ప్రవీణ్ కుమార్, ఏసీపీ ఏబీ పృథ్వీరాజ్, గోపాలపట్నం సీఐ ఎన్.వి.ప్రభాకర్, వెస్ట్ జోన్ ట్రాఫిక్ సీఐ కె.సురేశ్, ఎస్ఐ అప్పలనాయుడు, రైల్వే, సివిల్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రతిష్ఠను పెంచేది ఉద్యోగులే: ఎమ్మెల్యే గణబాబు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పి.గణబాబు

ఎన్.ఎ.డి.జంక్షన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు చేరవేసి ప్రభుత్వ ప్రతిష్ఠను పెంచేది ప్రభుత్వ ఉద్యోగులేనని ఎమ్మెల్యే గణబాబు అన్నారు. జీవీఎంసీ 52వ వార్డు కరాస వేమన మందిరంలో సచివాలయ ఉద్యోగులతో ఆత్మీయ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీ4, సంక్షేమ పథకాలు, పేదరికం నిర్మూలన తదితర అంశాలను ఆధారంగా ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఈ ప్రాంతంలో బంగారు కుటుంబాలను ఎంపిక చేయవల్సిన బాధ్యత సచివాలయ ఉద్యోగులపైనే ఉందన్నారు. జోన్5 జడ్సీ బి.రాము మాట్లాడుతూ లబ్ధిదారుల ఎంపిక విషయంలో ఎటు వంటి గందరగోళానికి తావులేకుండా అర్హత కలిగిన వారినే ఎంపిక చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు వై.తిరుమలరావు, మార్కెటింగ్ కమిటీ వైస్ చైర్మన్ వెంకుమహంతి చంద్రశేఖర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పాత్రుడు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

వర్షాలు లేక ఎండుతున్న నారుమడులు



పూర్తిగా ఎండిపోయిన నారుమడి

పెందుర్తి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్ ఆరంభంలో కురిసిన వర్షాలను చూసి రైతులు ఎంతో ఆశతో నారుమడులను సిద్ధం చేసుకున్నారు. కానీ క్రమేణ వానలు తగ్గిపోయి, ఎండాకాలాన్ని తలదన్నేలా ఎండలు కాస్తుండడంతో వరినారులు ఎండిపోతున్నాయి. కొంత మంది రైతులు తమ వరిమడులను తడుపుకోవడానికి బావులు, పంపు సెట్లమీద ఆధార పడుతున్నారు. మరి కొన్ని గ్రామాల్లో ఎండిపోతున్న వరిని ఎలా కాపాడుకోవాలని రైతులు దిగులు చెందుతున్నారు. ముదపాక, సరిపల్లి, నరవ, ఎస్ఆర్‌పురం, గొరపల్లి, రాంపురం, రాజయ్యపేట గ్రామాల్లో నారు ఎండిపోవడం అధికంగా కనిపిస్తోంది. అప్పులు చేసి మరీ వ్యవసాయం చేస్తున్నామని, పరిస్థితి చూస్తుంటే కరువు కమ్ముకొస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 'వరుణుడు కరుణిస్తాడని ఎదురు చూడని రోజంటూ లేదు. రెండు వారాలుగా అసలు వర్షాలే పడలేదు. ఇప్పటి వరకు బావి నిరు మీద నారుమడిని కాపాడుకున్నాం. ఇక వర్షమే దిక్కు. వర్షం పడాలని ఆ దేవుడికి మొక్కుకుంటున్నాను' అని ఓ రైతు తన బాధను పంచుకున్నారు.

యూరియా, పొటాష్ పిచికారీ చేయాలి

ఎండ తీవ్రత ఎక్కువ ఉడడంతో నారుమడులు ఎండిపోతున్నాయి. దీనికి పరిష్కారం ఉంది. వంద గ్రాముల యూరియా, వంద గ్రాములు పొటాష్ ఒక ట్యాంక్ నీటిలో కలిపి నారుమడుల్లో పిచికారీ చేస్తే నారు నీటి ఎద్దడిని తట్టుకుంటుంది. వ్యవసాయ శాస్త్రవేత్తలగా క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించి రైతులకు వ్యవసాయం చేయడంలో సలహాలు, సూచనలు అందజేస్తున్నాము.

- చంద్రకళ (వ్యవసాయాధికారి, పెందుర్తి)



ప్రమాదాలకు నిలయంగా మారిన దుర్గానగర్ జంక్షన్ రోడ్డు

గోతులమయంగా దుర్గానగర్ జంక్షన్

తరచూ ప్రమాదాల బారినపడుతున్నామని ద్విచక్ర వాహనదారుల ఆవేదన

గాజువాక, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): గాజువాక-అచ్యుతాపురం మార్గంలోని స్టీల్ ప్లాంట్ రోడ్డు దుర్గానగర్ జంక్షన్ పెద్ద గోతులతో ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డు కనీసం మరమ్మతులకు కూడా నోచుకోకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. స్టీల్ ప్లాంట్ కార్మికులు, పరవాడ, అచ్యుతాపురం, పరిసర ప్రాంతాల్లో పనిచేసే కార్మికులు, స్థానికులు నిత్యం ఈ మార్గం గుండానే రాకపోకలు సాగిస్తుంటారు. దీంత ఎప్పుడూ ఈ కూడలి రద్దీగా ఉంటుంది. దుర్గానగర్ జంక్షన్ నుంచి సుమారు యాభై మీటర్ల వరకు రోడ్డు గోతులతో నిండివుండడంతో తరచూ ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారినపడుతున్నారు. వర్షాల సమయంలో ఈ రోడ్డు పరిస్థితి మరీ దారుణంగా ఉంటుందని పలువురు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోతుల్లో నీరు చేరడం వల్ల ఎక్కడ గుంత ఉందో తెలియక వాటి మీదుగా రాకపోకలు సాగించి కిందపడి పలువురు ఇప్పటికే గాయపడ్డారని స్థానికులు చెబుతున్నారు. అంతేకాక ఈ జంక్షన్‌లో విద్యుత్ దీపాలు లేకపోవడంతో రాత్రిపూట ప్రమాదాలు మరింతగా జరుగుతున్నామని వాపోతున్నారు. గోతులమయమైన ఈ రోడ్డుకు మరమ్మతులు చేయాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండా పోయిందని పేర్కొంటున్నారు. కాగా ఈ రోడ్డు కోర్టు వివాదంలో ఉన్నందునే అభివృద్ధికి నోచుకోవడం లేదని స్థానికంగా ప్రచారం జరుగుతుంది. ఏదిఏమైనా ఈ కూడలిలో ప్రమాదాలకు అడ్డుకట్ట వేసేందుకు అధికారులు తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

సచివాలయ ఉద్యోగులకు సత్కారం



సచివాలయ ఉద్యోగులను సత్కరించిన టీడీపీ నాయకులు

అగనంపూడి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధిలోని పలు సచివాయాల్లో పని చేసి బదిలీపై వెళ్లిన శానిటరి కార్యదర్శులు రాంబాబు, నరేశ్, భవానీ, ఎం.శ్రీనులతో పాటు శానిటరీ సూపర్‌వైజర్‌గా పదోన్నత పొందిన కోటేశ్వరరావులను బుధవారం స్థానిక సీడబ్ల్యూసీలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా టీడీపీ వార్డు అధ్యక్షుడు కర్రి దేవేంద్ర మాట్లాడుతూ అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు సమాజంలో ఎప్పుడూ మంచి గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీతారామయ్య, స్థానిక నాయకులు బుదిరెడ్డి అప్పారావు, డొక్కా రమేశ్, బి.సత్యనారాయణ, కె.పైడిరాజు, జి.పద్మ, చిత్రా నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

గండి బాబ్జికీ కృష్ణాష్టమి వేడుకల ఆహ్వానం



గండి బాబ్జితో ఆలయ కమిటీ సభ్యులు

వేపగుంట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 98వ వార్డు లక్ష్మీనరసింహ నగర్‌లో ఈనెల 16న జరిగే కృష్ణాష్టమి వేడుకల ఆహ్వాన పత్రికలను టీడీపీ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి గండిబాబ్జీకీ కమిటీ సభ్యులు బుధవారం అంద జేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15 సాయంత్రం శోభాయాత్రతో ప్రారంభమై 16 ఉదయం స్వామివారికి క్షీరాభిషేకం, సహస్రపుష్పార్చన, సామూహిక విష్ణు సహస్రనామపారాయణం తదితర కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.

ఆరేళ్లుగా మూతపడిన సులాభ్ కాంప్లెక్స్



యారాడ బీచ్ ఒడ్డున మూతపడిన సులాభ్ కాంప్లెక్స్

మల్కాపురం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): యారాడ సముద్రం ఒడ్డున సుమారు రూ.20 లక్షల జీవీఎంసీ నిధులతో నిర్మించిన సులాభ్ కాంప్లెక్స్ ఆరున్నర ఏళ్లగా మూతపడింది. వైసీపీ హయాంలో ఇది మూతపడింది. కూటమి అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తయినా దీనిని పట్టించుకోకపోవడంతో పలువురు విమర్శిస్తున్నారు. సులాభ్ కాంప్లెక్స్‌లో ఏమైన సమస్యలుంటే జీవీఎంసీ అధికారు లు వాటిని గుర్తించి పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు. స్థానికులు అనేకసార్లు స్థానిక ఎమ్మెల్యే, కార్పొరేటర్‌కు సులాభ్ కాంప్లెక్స్ గురించి విన్నవిం చినా వారు పట్టించుకోలేదు. రోజురోజుకు యారాడకు పర్యాటకుల సంఖ్య పెరు గుతూ వస్తోంది. వచ్చిన టూరిస్టులకు కాలకృత్యాలు తీర్చుకోవడానికి ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యపై పర్యాటక విభాగ అధికారులు చర్యలు తీసుకో వాలని స్థానికులు, టూరిస్టులు కోరుతున్నారు.

పాఠశాలకు సౌండ్ సిస్టమ్ వితరణ



కొత్త సౌండ్‌సిస్టమ్‌తో ఉపాధ్యాయులు

మల్కాపురం. ఆ గస్టు 6 (ఆంధ్రజ్యోతి): గాజువాక మండలంలో యారాడ జిల్లా పరిషత్ పాఠశాలకు జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు జీఎం.సుజాత సౌండ్ సిస్టమ్స్‌ను బుధవారం వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల పాఠశాలలో జరిగిన ఓ కార్యక్రమంలో పాత సౌండ్ సిస్టమ్ సరిగా పనిచేయలేదని, దీంతో సొంత నిధులతో కొత్త సిస్టమ్‌ను బహుకరించానని తెలిపారు. సుజాతను తోటి అధ్యాపకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఏపీఎల్ సమరం


పీఎంపాలెంలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియం

ఆంధ్రా ప్రీమియర్ లీగ్‌కు సర్వం సిద్ధం

- ఏడు జట్ల మధ్య జరగనున్న మ్యాచ్‌లు
- వేదిక పీఎం పాలెంలోని ఏసీఏ వీడీసీఏ స్టేడియం
- బ్రాండ్ అంబాసిడర్‌గా సినీనటుడు వెంకటేష్!

విశాఖపట్నం స్పోర్ట్సు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): **ఏసీఏ వీడీసీఏ స్టేడియం వేదికగా ఈ నెల 8 నుంచి జరగనున్న ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) సీజన్-4 టోర్నీకి ఏర్పాట్లు పూర్తయ్యాయి. అమరావతి రాయల్స్, తుంగభద్ర వారియర్స్, సింహాద్రి వైజాగ్ లయన్స్, కాకినాడ కింగ్స్, భీమవరం బుల్స్, విజయవాడ సన్‌షైనర్స్, రాయలసీమ రాయల్స్ మధ్య మ్యాచ్‌లు జరగనున్నాయి. సీజన్-3లో ఆరు జట్ల మధ్య మ్యాచ్‌లు జరగ్గా, సీజన్-4లో ఏడు జట్లు పాల్గొంటున్నాయి. ఆర్.కె.స్పోర్ట్సు (కాకినాడ కింగ్స్), అక్షర ఎంటర్ ప్రైజెస్ ఇండియా లిమిటెడ్ (రాయలసీమ రాయల్స్), విజేత సూపర్ మార్కెట్ ప్రైవేటు లిమిటెడ్ (తుంగభద్ర వారియర్స్), అపర్ణా మెరైన్ ఎక్స్‌పోర్ట్సు (అమరావతి రాయల్స్), మైత్రి మూవీ మేకర్స్ (విజయవాడ సన్‌షైనర్స్), మార్లిన్ గ్లోబల్ ఎనర్జీ ప్రైవేటు లిమిటెడ్ (భీమవరం బుల్స్), స్టీల్ ఎక్స్ఛేంజ్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ (సింహాద్రి వైజాగ్ లయన్స్) ఫ్రాంచైజీలుగా వ్యవహరిస్తున్నాయి.**

వేలం ప్రక్రియ సాగిందిలా...

నాలుగు కేటగిరీల నుంచి 520 మంది ఆటగాళ్లను వేలంలో ఉంచి, ఒక్కో ఫ్రాంచైజర్‌కు రూ.45 లక్షలు కేటాయించారు. టీమిండియాకు ప్రాతినిధ్యం వహించినవారితో పాటు ఐపీఎల్, తదితర టోర్నీలు ఆడిన తొమ్మిదిమంది ఆటగాళ్లను 'మార్కీ' పేరుతో టాప్ సీడ్‌లో ఉంచగా, మిగిలిన గ్రేడ్-ఏలో 21 మంది, గ్రేడ్-బీలో 112, గ్రేడ్-సీలో 378మందిని వేలంలో ఉంచారు. అత్యధిక ధర పైలా అవినాష్ (రూ.11.5 లక్షలు) రాయల్స్ ఆఫ్ రాయలసీమకు, సింహాద్రి వైజాగ్ లయన్స్‌కు రికీ బుయ్ (రూ.10.26 లక్షలు), భీమవరం బుల్స్‌కు నితీష్‌కుమార్‌రెడ్డి (రూ.10 లక్షలు), కాకినాడ కింగ్స్‌కు శ్రీకర్ భరత్ (రూ.10 లక్షలు), తుంగభద్ర వారియర్స్‌కు కేవీ శశికాంత్ (రూ.5 లక్షలు) అత్యధిక ధర పలికారు. ఇతర జిల్లాల ఆటగాళ్లలో రాయల్స్ ఆఫ్ రాయలసీమకు గిరినాథరెడ్డి (రూ.10.05 లక్షలు), రూ.10 లక్షలు పలికినవారిలో అమరావతి రాయల్స్‌కు హనుమ విహారి, విజయవాడ సన్‌షైనర్స్‌కు అశ్విన్ హెబ్బర్, రాయల్స్ ఆఫ్ రాయలసీమకు షేక్ రషీద్ ఉన్నారు.

బ్రాండ్ అంబాసిడర్‌గా వెంకటేష్

ఏపీఎల్ సీజన్-4కు బ్రాండ్ అంబాసిడర్‌గా సినీనటుడు దగ్గుబాటి వెంకటేష్ వ్యవహరించనున్నారని సమాచారం. ఈ నెల 8న రాత్రి 7.30 గంటలకు కాకినాడ కింగ్స్, అమరావతి రాయల్స్ మధ్య జరగనున్న ప్రారంభ మ్యాచ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని తెలిసింది.

మ్యాచ్‌ల షెడ్యూల్:

తేది	తలపడనున్న జట్లు	సమయం
ఆగస్టు 8	కాకినాడ కింగ్స్-అమరావతి రాయల్స్	రాత్రి 7.30 గంటలకు
ఆగస్టు 9	విజయవాడ సన్‌షైనర్స్-రాయల్స్ ఆఫ్ రాయలసీమ	మధ్యాహ్నం 1.30 గం.లకు
ఆగస్టు 9	తుంగభద్ర వారియర్స్-సింహాద్రి వైజాగ్ లయన్స్	రాత్రి 6.30 గంటలకు
ఆగస్టు 10	కాకినాడ కింగ్స్- విజయవాడ సన్‌షైనర్స్	మధ్యాహ్నం 1.30 గం.లకు
ఆగస్టు 10	భీమవరం బుల్స్-రాయల్స్ ఆఫ్ రాయలసీమ	రాత్రి 6.30 గంటలకు
ఆగస్టు 11	అమరావతి రాయల్స్-తుంగభద్ర వారియర్స్	మధ్యాహ్నం 1.30 గం.లకు
ఆగస్టు 11	సింహాద్రి వైజాగ్ లయన్స్-కాకినాడ కింగ్స్	రాత్రి 6.30 గంటలకు
ఆగస్టు 12	భీమవరం బుల్స్-అమరావతి రాయల్స్	మధ్యాహ్నం 1.30 గం.లకు
ఆగస్టు 12	విజయవాడ సన్‌షైనర్స్-సింహాద్రి వైజాగ్ లయన్స్	రాత్రి 6.30 గంటలకు
ఆగస్టు 13	రాయల్స్ ఆఫ్ రాయలసీమ-తుంగభద్ర వారియర్స్	మధ్యాహ్నం 1.30 గం.లకు
ఆగస్టు 13	విజయవాడ సన్‌షైనర్స్-భీమవరం బుల్స్	రాత్రి 6.30 గంటలకు
ఆగస్టు 14	విశ్రాంతి (రెస్ట్ డే)	
ఆగస్టు 15	సింహాద్రి వైజాగ్ లయన్స్-రాయల్స్ ఆఫ్ రాయలసీమ	మధ్యాహ్నం 1.30 గం.లకు
ఆగస్టు 15	భీమవరం బుల్స్-తుంగభద్ర వారియర్స్	రాత్రి 6.30 గంటలకు
ఆగస్టు 16	అమరావతి రాయల్స్-సింహాద్రి వైజాగ్ లయన్స్	మధ్యాహ్నం 1.30 గం.లకు
ఆగస్టు 16	తుంగభద్ర వారియర్స్-కాకినాడ కింగ్స్	రాత్రి 6.30 గంటలకు
ఆగస్టు 17	సింహాద్రి వైజాగ్ లయన్స్-భీమవరం బుల్స్	మధ్యాహ్నం 1.30 గం.లకు
ఆగస్టు 17	రాయల్స్ ఆఫ్ రాయలసీమ-కాకినాడ కింగ్స్	రాత్రి 6.30 గంటలకు
ఆగస్టు 18	తుంగభద్ర వారియర్స్- విజయవాడ సన్‌షైనర్స్	మధ్యాహ్నం 1.30 గం.లకు
ఆగస్టు 18	రాయల్స్ ఆఫ్ రాయలసీమ-అమరావతి రాయల్స్	రాత్రి 6.30 గంటలకు
ఆగస్టు 19	కాకినాడ కింగ్స్-భీమవరం బుల్స్	మధ్యాహ్నం 1.30 గం.లకు
ఆగస్టు 19	అమరావతి రాయల్స్- విజయవాడ సన్‌షైనర్స్	రాత్రి 6.30 గంటలకు
ఆగస్టు 20	విశ్రాంతి (రెస్ట్ డే)	
ఆగస్టు 21	ఎలిమినేటర్ మ్యాచ్	మధ్యాహ్నం 1.30 గం.లకు
ఆగస్టు 21	క్వాలిఫయిర్-1 మ్యాచ్	రాత్రి 6.30 గంటలకు
ఆగస్టు 22	క్వాలిఫయిర్-2 మ్యాచ్	
ఆగస్టు 23	ఫైనల్	
ఆగస్టు 24	రిజర్వ్ డే ఫర్ ఫైనల్	

సింహాద్రి వైజాగ్ లయన్స్ జెర్సీ ఆవిష్కరణ


జెర్సీలతో సింహాద్రి వైజాగ్ లయన్స్ జట్టు క్రీడాకారులు

ఎండాడ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్)లోకి సింహాద్రి వైజాగ్ లయన్స్ పేరుతో మరో కొత్త జట్టు ప్రవేశించింది. మధురవాడలోని ఏసీఏ వీడీసీఏ స్టేడియం వేదికగా ఈనెల 8వ తేదీ నుంచి ఏపీఎల్ మ్యాచ్‌లు జరగనున్న విషయం తెలిసిందే. సింహాద్రి వైజాగ్ లయన్స్, గీతం వర్సిటీ భాగస్వామ్యంతో ఏర్పాటైన జట్టు జెర్సీని గీతం వర్సిటీలోని బాలయోగి ఆడిటోరియం వేదికగా ఎంపీ శ్రీభరత్ బుధవారం వర్చువల్‌గా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన జట్టులోని క్రీడాకారులను అభినందిస్తూ ప్రతి క్రీడాకారుడు ఉన్నత స్థానంలోకి వెళ్లి విశాఖ బ్రాండ్‌ను పెంచేలా కృషి చేయాలని సూచించారు. అనంతరం క్రీడాకారులకు జట్టు ఫ్రాంచైజర్ టీ షర్టులు అందజేసింది. ఈ కార్యక్రమంలో టీం ఫ్రాంచైజర్, స్టీల్ ఎక్స్ఛేంజ్ ఇండియా లిమిటెడ్ డైరెక్టర్ బండి మోహిత్, బండి రమీలా, బవినేని సూర్య, టి.హర్ష, బవినేని మిత్రి, తదితరులు పాల్గొన్నారు.

ఇగ్నో అడ్మిషన్ల గడువు పొడిగింపు

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం దూరవిద్య, ఆన్‌లైన్ కోర్సులలో ప్రవేశాల గడువును ఆగస్టు 15 వరకూ పెంచింది. విశ్వ విద్యాలయం అందిస్తున్న అన్ని సర్టిఫికెట్ డిప్లమో, పీజీ డిప్లమో, డిగ్రీ, పీజీ కోర్సులలో ప్రవేశాలకు పెంపు గడువు వర్తిస్తుందని సంస్థ సీనియర్ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్లు ఆన్‌లైన్ విధానంలోనే పొందాలని, ఫీజులను కూడా ఆన్‌లైన్‌లోనే చెల్లించాలని స్పష్టం చేశారు. ఎంపిక చేసిన డిగ్రీ కోర్సులలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 50 శాతం ఫీజు రాయితీ ఉంటుందన్నారు. వివరాలకు ఇగ్నో వెబ్‌సైట్, ఇగ్నో ప్రాంతీయ కేంద్రాన్ని సంప్రదించాలన్నారు.

ఫోర్త్‌టౌన్ సీఐగా ఉమాకాంత్

విశాఖపట్నం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఫోర్త్‌టౌన్ పోలీస్‌స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా సీహెచ్ ఉమాకాంత్‌ను నియమిస్తూ సీపీ శంఖబ్రతబాగ్చి బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ఇతను ప్రస్తుతం సోషల్‌మీడియా మానిటరింగ్ సెల్ సీఐగా పనిచేస్తున్నారు. ఇక్కడి సీఐ సత్యనారాయణను సోషల్‌మీడియా మానిటరింగ్ సెల్‌కు బదిలీచేశారు. ఇదిలావుండగాస్టేషన్ పరిధిలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం ఒక ఇంటిపై దాడిచేసి పేకాట ఆడుతున్న మహిళలను పట్టుకున్నారు. వారి నుంచి రూ.22వేలు స్వాధీనం చేసుకున్నారు. విచారించగా తాము ఫోర్త్‌టౌన్ పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్‌కు నెలవారీ మామూళ్లు ఇస్తున్నామని, గతంలో పట్టుబడినా కేసులేకుండా వదిలేశారని తెలిపింది. దీనిపై అధికారులు సీపీకి సమాచారం ఇచ్చారు. ఈ నేపథ్యంలో సీఐ సత్యనారాయణను ఆకస్మికంగా బదిలీచేసినట్టు ప్రచారం జరుగుతోంది.

పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

ఎయిర్‌పోర్టు పర్యావరణ కమిటీ సమావేశంలో కలెక్టర్

గోపాలపట్నం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): విమానాశ్రయ పరిసరాల పరిశుభ్రతకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని పర్యావరణ కమిటీకి జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విమానాశ్రయ పరిసరాల్లోని డ్రైన్‌ల ద్వారా మురుగునీరు, వర్షం నీరు సాఫీగా పోయేలా చర్యలు చేపట్టాలని సూచించారు. గోడల సమీపంలో ఆహారవ్యర్థాలు వేయడం వలన పక్షుల సంచారంతో ప్రమాదాలు సంభవిస్తాయని, దీనిపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని ఆదేశించారు. పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి గెడ్డల్లో పూడికతీత పనులు చేపట్టాలన్నారు. విమానాశ్రయ డైరెక్టర్ ఎస్.పురుషోత్తమ్ మాట్లాడుతూ ఐఎన్ఎస్ డేగా బృందంతో విమానాశ్రయ పరిసర ప్రాంతాల్లో ఇటీవల ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, ఇబ్బందికర పరిస్థితులను గుర్తించామని తెలిపారు. పోర్టు సమీపంలోని గెడ్డల్లో పూడికతీత చేపట్టలేదని, ట్రక్ పార్కింగ్ ప్రాంతంలో డ్రైవర్లు ఆహార వ్యర్థాలు వేస్తున్నట్టు గుర్తించామన్నారు. విమానాశ్రయ పరిసరాల్లోని నీటి కుంటల వద్ద కు పక్షులు చేరకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎయిర్‌పోర్ట్ అథారిటీ, ఐఎన్ఎస్ డేగా, జీవీఎంసీ, ఇరిగేషన్ శాఖల అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

వైద్యుల సమక్షంలోనే ఆల్బెండోజోల్ మాత్రలు వేయాలి

మహారాణిపేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 12న నులిపురుగుల నివారణ దినం సందర్భంగా చిన్న పిల్లలకు అందించే ఆల్బెండోజల్ మాత్రలను వైద్యుల సమక్షంలోనే వేయాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్‌హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనుకోని రీతిలో రియాక్షన్ వచ్చే సందర్భంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని అన్ని శాఖలు సమన్వయంతో విజయవంతం చేయాలని, చిన్నారుల ఆరోగ్యంపై దుష్పరిణామాలు చూపే నులిపురుగుల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ మాత్రలను ఖాళీ కడుపుతో వేయరాదని, ఇంటికి ఎట్టి పరిస్థితుల్లో ఇవ్వరాదని, మధ్యాహ్న భోజనం అనంతరం వైద్యుల సమక్షంలో వీటిని వేసేలా చూడాలని పేర్కొన్నారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారి పి.జగదీశ్వరరావు, వైద్యాధికారులు, డాక్టర్ ఎన్‌వీ సమత, డాక్టర్ కె.అప్పారావు, బి.వి. విజయలక్ష్మి పాల్గొన్నారు.

జైలు అధికారులు వేధిస్తున్నారు

- మాజీ ఎంపీ ఎంవీవీ కుటుంబసభ్యుల కిడ్నాప్ కేసు నిందితుల లేఖ

ఆరిలోవ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తమను విశాఖ కేంద్ర కారాగారం అధికారులు వేధిస్తున్నారంటూ మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ కుటుంబసభ్యుల కిడ్నాప్ కేసులో నిందితులు ఉలవ రాజేష్, మీర్జాఖాన్‌లు మీడియాకు లేఖ రాశారు. అది సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. లేఖలో పేర్కొన్న వివరాల ప్రకారం... రిమాండ్‌లో ఉన్న తాము జైలులో సెల్‌ఫోన్ వినియోగిస్తున్నామని అభియోగం మోపుతున్నారని, తప్పుడు సాక్ష్యాలను సృష్టించి జైలు సూపరింటెండెంట్ మహేష్‌బాబు, డిప్యూటీ సూపరింటెండెంట్ సాయిప్రవీణ్‌లు వేధిస్తున్నారని ఆరోపించారు. అంతేకాకుండా మార్చి 18న కోర్టు వాయిదాకు హాజరైన సందర్భంలో జైలు అధికారుల తీరుపై న్యాయమూర్తికి ఫిర్యాదు చేశామని, దీంతో వేధింపులు పెరిగిపోయాయన్నారు. బ్యారక్ నుంచి తమను బయటకు రానీయడం లేదని, జడ్జికి ఇచ్చిన ఫిర్యాదును వెనక్కి తీసుకోకపోతే హింస తప్పదని బెదిరిస్తున్నారన్నారు. జైల్లో జరుగుతున్న అవతవకలపై నిలదీస్తే గంజాయి వినియోగిస్తున్నావంటూ తప్పుడు కేసులు పెడతామని నాగన్న అనే నిందితుడ్ని కూడా బెదిరిస్తున్నారని ఆరోపించారు.

కాగా ఈ లేఖలోని అంశాలపై జైలు డిప్యూటీ సూపరింటెండెంట్ సాయిప్రవీణ్ వద్ద ప్రస్తావించగా రాజేష్, మీర్జాఖాన్‌లపై ఎలాంటి వేధింపులు లేవని, వారి బ్యారక్ ఎదురుగా సీసీటీవీ కెమెరాలున్నాయని, అన్నింటినీ అవి రికార్డు చేస్తాయన్నారు. వారికి మూడు పూటలా మంచి ఆహారం, రొట్టె, పాలు అందిస్తున్నామన్నారు. ఇటీవల లీగల్ సెల్ అథారిటీ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు జైలును సందర్శించారని, ఆ సమయంలోనూ నిందితులుఎలాంటి ఫిర్యాదు చేయలేదన్నారు. ఇదంతా పెద్ద డ్రామా అని, సెల్‌ఫోన్ వాడుతున్న వైనం బయటపడడంతో దానినుంచి తప్పించుకునేందుకు చేస్తున్న కుట్ర అన్నారు. అందరి ఖైదీల మాదిరిగానే వారినీ చూస్తున్నామన్నారు.


2,250 కేజీల రేషన్ బియ్యం పట్టివేత

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న 2,250 కేజీల రేషన్ బియ్యాన్ని ఎంవీపీ పోలీసులు పట్టుకున్నారు. సీఐ మురళి తెలిపిన వివరాల ప్రకారం.. పోలీసులు, సివిల్ సప్లై సర్కిల్ 2 ఇన్‌స్పెక్టర్ నమ్మి నరేష్‌బాబు జాలారిపేట వద్ద తనిఖీ చేస్తుండగా బొలెరో వాహనం తప్పించుకోవడానికి ప్రయత్నించింది. దీంతో వాహనాన్ని, పూర్ణమార్కెట్ ప్రాంతానికి చెందిన డ్రైవర్ సూరి జగన్నాథరావును అదుపులోకి తీసుకున్నారు. వ్యాన్‌ను తనిఖీ చేయగా 50 కిలోల చొప్పున 45 బ్యాగుల రేషన్ బియ్యం గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. తన కుమారుడు మోహన్ బియ్యం సేకరిస్తుంటాడని నిందితుడు తెలిపాడు. కేసు నమోదు చేశారు.

రాష్ట్రానికే ఆదర్శంగా భూ సమీకరణ : ఎమ్మెల్యే గంటా

- రామవరం, జీఎస్ అగ్రహారం గ్రామాల రైతులకు ఎల్‌పీఓసీలు అందజేత

ఆనందపురం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామవరం, జీఎస్ అగ్రహారం గ్రామాల్లో చేపట్టిన ల్యాండ్ పూలింగ్ రాష్ట్రానికే ఆదర్శమని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఆయా గ్రామాల్లోని రైతులకు బుధవారం భూ యాజమాన్య హక్కు పట్టాలు (ఎల్‌పీఓసీ) అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం పేదల ఇళ్ల పట్టాల కోసం మండలంలో రెండు వేల నుంచి మూడు వేల ఎకరాలు సేకరించాల్సి ఉందన్నారు. ఈనేపథ్యంలో రామవరం, జీఎస్ అగ్రహారం రైతులు ముందుకు వచ్చి ల్యాండ్ పూలింగ్ కోసం మొత్తం 230 ఎకరాలు ఇవ్వడం ప్రశంసనీయమని కొనియాడారు. వీఎంఆర్ డీఏ లేఅవుట్ వల్ల చుట్టు పక్కల భూముల ధరలు కూడా పెరుగుతాయని తెలిపారు. నియోజకవర్గంలో ఇనాం భూముల రైతులు ఎదుర్కొంటున్న సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని చెప్పారు. కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ ఆక్రమణలో ఉన్న వారికి కూడా పరిహారం ఇచ్చేలా ప్రభుత్వానికి లేఖ రాశామన్నారు. ఈ కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ కమి షనర్ విశ్వనాథన్, జాయింట్ కలెక్టర్ మయూర్ అశో క్, ఆర్డీవో కె.సంగీత్ మాథూర్, కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు పంచకర్ల సందీప్, రామవరం సర్పంచ్ ఎర్రరాజు, కూటమి నాయకులు సుభాష్ చంద్రబోస్, గంద్రెడ్డి స్వామినాయుడు, శ్రీకాంత్ రాజు, తాత్రాజు అప్పారావు, బీఆర్‌బీ నాయుడు, అగరపు దేముడుబాబు, పొంద్రంకి అప్పలరాజు, బలిరెడ్డి మల్లికార్జునరావు, గంద్రెడ్డి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.


మహిళా రైతుకు ఎల్‌పీఓసీ అందిస్తున్న భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, చిత్రంలో కలెక్టర్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ ఉన్నారు

ఏయూలో క్వాంటం కంప్యూటింగ్ కోర్సు ప్రారంభం


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ రాజశేఖర్, ప్రొఫెసర్లు, విద్యార్థులు

విశాఖపట్నం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయంలో క్వాంటం కంప్యూటింగ్ కోర్సును బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. ఏయూ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ బ్రోచర్‌ను ఆవిష్కరించి మాట్లాడుతూ ఈ కోర్సును అందిస్తున్న తొలి ప్రభుత్వ వర్సిటీ అన్నారు. నేషనల్ క్వాంటం మిషన్‌ను కేంద్రం ఏర్పాటు చేసిందన్నారు. ప్రత్యేక ల్యాబ్, మౌలిక సదుపాయాల కల్పనకు కృషిచేస్తున్నట్టు వెల్లడించారు. ఈ దిశగా ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. సీఎం చంద్రబాబు డ్రీమ్ ప్రాజెక్ట్‌గా ప్రభుత్వం అమరావతిలో క్వాంటం వ్యాలీని ఏర్పాటు చేసిందని, ఇందులో భాగంగానే ఇటీవల జరిగిన వర్క్‌షాప్ విజయవం తమైందన్నారు. క్లస్టర్ స్థాయిలో పలు సదస్సులను నిర్వహించిందన్నారు. ప్రస్తుతం ఈ కోర్సులో చేరిన విద్యార్థులు ద్వితీయ సంవత్సరంలోకి వచ్చే సమయానికి క్వాంటంసంస్థలతో కలిసి పనిచేసే అవకాశం ఉంటుందన్నారు. క్వాంటం కంప్యూటింగ్ రంగంలో పెద్దసంఖ్యలో ప్రొఫెసర్లను నిపుణులుగా తీర్చిదిద్దేందుకు త్వరలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ నిర్వహించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన ప్రొఫెసర్లు పాల్గొంటారన్నారు. దేశంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాలు, విద్యాసంస్థల ప్రొఫెసర్లు, పరిశ్రమల నిపుణులు శిక్షణ ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతులు, ప్రొఫెసర్లు, వర్సిటీ విద్యార్థులు పాల్గొన్నారు.

క్రైం... crime news

దారి కోసం రెండు కుటుంబాల మధ్య కొట్లాట

- దంపతులకు తీవ్ర గాయాలు
- నలుగురి అరెస్టు


గాయపడిన వెంకటరమణ, బంగారమ్మ

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): దారి కోసం రెండు కుటుంబాల మధ్య జరిగిన వివాదం కొట్లాటకు దారితీసింది. ఈ ఘటనలో భార్యాభర్తలకు తీవ్రగాయాలయ్యాయి. గ్రేటర్ 77వ వార్డు శివారు అప్పికొండ చేపలపాలెంలో జరిగిన సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన చోడిపల్లి వెంకటరమణ, గరికిన గంగరాజు మధ్య ఇంటి దారి విషయంలో బుధవారం గొడవ జరిగింది. ఈ క్రమంలో రెండు కుటుంబాల సభ్యులు కలుగజేసుకోవడంతో కొట్లాటకు దారితీసింది. కర్రలు, ఇనుప రాడ్లతో దాడి చేసుకున్నారు. దువ్వాడ సీఐ మల్లేశ్వరరావు, ఎస్ఐ శ్రీనివాసరావులు ఘటనా స్థలికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు. ఇరువర్గాల ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. తీవ్రంగా గాయపడిన చోడిపల్లి వెంకటరమణ, ఆయన భార్య బంగారమ్మ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. దాడికి పాల్పడిన గరికిన గంగరాజు, గరికిన బంగారమ్మ, ఉమాకోటేశ్వరరావు, భానులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కణితి రైల్వే బ్రిడ్జి ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. మృతుడి వయసు 45 ఏళ్లు ఉంటుందని, ముఖం నుజ్జునుజ్జయిపోవడంతో గుర్తు పట్టేందుకు వీల్లేకుండా ఉందని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి సమాచారం తెలిస్తే సంప్రదించాలని సీఐ కేశవరావు పేర్కొన్నారు.

ప్రేమపేరిట మోసం: నిందితుడిపై కేసు నమోదు

అక్కయ్యపాలెం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరిట మోసపోయిన యువతికి టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని వసతిగృహంలో ఆశ్రయం కల్పించామని ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. విజయనగరం జిల్లాకు చెందిన ఈమె నర్సింగ్ చదువుకుందని, ఇన్‌స్టాగ్రాంలో పరిచయమైన వైజాగ్ యువకుడిని ప్రేమించి, పెళ్లికాకుండా గర్భందాల్చిందన్నారు. ఇంట్లో విషయం తెలియడంతో తల్లిదండ్రులు బయటకు పంపేశారన్నారు. యువకుడు పెళ్లికి నిరాకరించడంతో రెండో పట్టణ పోలీసులను ఆశ్రయించిందని తెలిపారు. ఏఎస్ఐ కన్నారావు, కానిస్టేబుల్ రాము నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఇరుపక్షాల తల్లిదండ్రులను రప్పించి సమస్య పరిష్కరించడానికి యువతిని స్టేషన్‌కు తీసుకు వెళ్లారన్నారు.

వ్యభిచార గృహంపై దాడి: ముగ్గురి అరెస్టు

పెందుర్తి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): గుట్టుగా వ్యభిచారం నిర్వహిస్తున్న ఇంటిపై పోలీసులు దాడి చేసి ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. సీఐ కెవీ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వేపగుంట సమీప సాయి మాధవ్‌నగర్‌లోని ఓ ఇంట్లో వ్యభిచారం జరుగుతోందని స్థానికులు సమాచారం అందించారు. దీంతో పెందుర్తి పోలీసులు ఆకస్మికంగా దాడి చేసి, వ్యభిచారం చేస్తున్న ఇద్దరు విటులతో పాటు నిర్వాహకుడుని అరెస్టు చేశారు. పట్టుబడ్డ యువతికి కౌన్సిలింగ్ నిర్వహించి పెందుర్తిలోని పునరావాస కేంద్రానికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి


సంఘటన స్థలంలో పోలీసుల పరిశీలన

పెందుర్తి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై పెందుర్తి వద్ద డివైడర్‌ను లారీ ఢీకొట్టిన సంఘటనలో డ్రైవర్ మృతిచెందాడు. సీఐ కేవీ సతీ శ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఉత్తరప్రదేశ్ నుంచి కోల్‌కత్తా వెళ్త న్న కంటైనర్ లారీ బుధవారం మధ్యాహ్నం సరిపల్లిహైవే కూడలి వద్ద రక్షణ గోడ డివైడర్‌ను ఢీకొట్టింది. డోరు ఊడిపోయి 30 అడుగుల ఎత్తు నుంచి కింద పడిపోవడంతో సంఘటనాస్థలంలోనే డ్రైవర్ మృతి చెందాడు. మృతు డు ఉత్తరప్రదేశ్ రోషన్‌నగర్ ప్రాంతానికి చెందిన రాకేశ్‌కుమార్ (46)గా గుర్తించారు. నిద్రమత్తుతోనే ప్రమాదం జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి, పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.